aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
సోమవారం
25-05-2026 సంపుటి : 01 సంచిక :64 పేజీలు : 08 వెల :₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## ప్లే ఆఫ్స్‌కు రాజస్తాన్

- ముంబయిపై 30 పరుగులతో గెలుపు
- జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండర్ షో
- రాజస్తాన్ 205/8 ముంబయి 175/9

ఉత్కంఠకు తెరపడింది. రాజస్తాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టింది. ఆదివారం వాంఖడెలో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై 30 పరుగుల తేడాతో గెలుపొందిన రాజస్తాన్ రాయల్స్ టాప్-4లో చోటు ఖాయం చేసుకుంది. రాజస్తాన్ రాయల్స్ గెలుపుతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ నిష్క్రమించాయి. ఈ నెల 26న ధర్మశాలలో క్వాలిఫయర్1లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ తలపడనుండగా.. 27న న్యూ చండీగఢ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్తాన్ రాయల్స్ ఎలిమినేటర్‌లో ఢీకొట్టనున్నాయి. 29న న్యూ చండీగఢ్‌లోనే క్వాలిఫయర్2 జరుగనుంది.

3



## ఒప్పందానికి తొందరేం లేదు..

- ఇరాన్-అమెరికా చర్చలపై ట్రంప్
- డీల్ కుదిరే వరకు ఇరాన్‌పై దిగ్బంధం కొనసాగుతుందని వెల్లడి
- 60 రోజుల శాంతి ఒప్పందం దాదాపు ఖరారైనట్టు వార్తలు
- అణు నిల్వలు వదులుకునేందుకు ఇరాన్ ఒప్పుకొన్నట్టు ప్రచారం

3

## మహిళా సంఘాలకు భారీ రుణాలు

### వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు



- సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబనే మూలక్ష్యం
- భవిష్యత్ కోసమే ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- వ్యవసాయ రంగంలో లక్ష్యాలను మించి బ్యాంకుల నుంచి రుణాలు
- డిప్యూటీ ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ మే 24 (మహప్రభ)
మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజాభవన్ లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే -మిగతా 3 లో





## తెలంగాణలో భానుడి ఉగ్రరూపం

- వడదెబ్బ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 34 మంది మృతి
- కుమ్రం భీం జిల్లాలో రికార్డు స్థాయిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- 18 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ
- రానున్న నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

న్యూఢిల్లీమే 24 (మహప్రభ)
తెలంగాణ రాష్ట్రం భానుడి భగభగలతో అగ్నిగుండంలా మారుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిప్పుల వర్షం కురుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత, వడగాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతూ, రాష్ట్రంలో ఇప్పటివరకు వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. వాతావరణ శాఖ రాష్ట్రంలోని 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. పగటిపూట బయటకు రావాలంటేనే ప్రజలు భయపడి ఇళ్లకే పరిమితమవుతున్నారు. నిన్న రాష్ట్రంలోనే అత్యధికంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్

-మిగతా 3 లో



## కుక్కలు, పిల్లులతో మాట్లాడొచ్చు!

బీజింగ్ మే 24 (మహప్రభ)
పెంపుడు కుక్కలు, పిల్లుల మాటలను, భావాలను కృత్రిమ మేధ సాయం తో వాటి మాటలకు అర్థాలు చెప్తామంటున్నది మెంగ్ గ్జియోగి అనే చైనా స్టార్టప్. తాము రూపొందించిన ఏఐ ఆధారిత పెట్ కాలర్ జంతువుల శబ్దాలు, ప్రవర్తనను మనుషుల భాషలోకి తర్జుమా చేస్తుందని చెప్తున్నది.దీని వల్ల మీ పెంపుడు జంతువు ఆడుకోవాలనుకొంటుందో.. ఆకలితో ఉందో ఇట్టే తెలుసుకోవచ్చని భరోసా ఇస్తున్నది! 95 శాతం కచ్చితత్వంతో వాటి మాటలకు అర్థాలు తెలుసుకోవచ్చని చెప్తున్నది.



## ప్రస్తుతం ప్రపంచం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది

- ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ కంపెనీలు ఇబ్బందులు పడుతున్నాయి
- తెలంగాణలో అధికార పార్టీ, బీఆర్ఎస్ రాజకీయ విమర్శలు చేస్తున్నారు
- బీజేపీ మద్దతుతోనే తెలంగాణ ఏర్పడింది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు

హైదరాబాద్ మే 24 (మహప్రభ)
ప్రస్తుతం ప్రపంచం తీవ్రమైన అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు అన్నారు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు -- 2026 ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ ఇరాన్--అమెరికా ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు మార్కెట్ తీవ్ర ఒత్తిడికి గురైందని పేర్కొన్నారు.

-మిగతా 3 లో




## నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు

- తెలంగాణ మహిళా సాధికారతకు కొత్త దిశ
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే సంకల్పం
- ఆదాయ వనరులు కల్పిస్తున్న ప్రజా ప్రభుత్వం
- మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామిక వేత్తలు, సంపద సృష్టికర్తల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సీతక్క

హైదరాబాద్ మే 24 (మహప్రభ)
తెలంగాణలో మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం కొత్త అర్థం చెబుతోంది. ఒకప్పుడు కేవలం పొదుపు సంఘాలుగా ఉన్న మహిళా స్వయం సహాయక బృందాలు... ప్రజా ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇప్పుడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామ్య శక్తులుగా ఎదుగుతున్నాయి. అణగారిన, సంక్షేమ లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు నిర్వహించనున్నారు.

-మిగతా 3 లో

## పాక్‌లో మరోమారు ఉగ్రకలకలం



- జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా భారీ పేలుడు
- సైనికుల ఫ్యామిలీలు వెళ్తుండగా విషాదం
- 24 మంది మృతి, సహాయకచర్యలు ఆరంభించిన ఆర్మీ
- దాడికి బాధ్యత వహించిన బలోచ్ లిబరేషన్ ఆర్మీ
- సైనికులు, వారి కుటుంబాలే ప్రధాన టార్గెట్‌గా వెల్లడి

3 లో

## మోటార్లకు మీటర్లను పెడుతున్న సర్కార్


### ప్రీపెయిడ్ మీటర్లతో విద్యుత్ రంగం ప్రైవేటుపరం



- ఉచిత విద్యుత్తు రద్దు కోసమే కుటిల యత్నాలు
- కాంగ్రెస్ కరెంటు కుట్రలను అడ్డుకుంటాం
- నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్ మే 24 (మహప్రభ)
రాష్ట్రంలో ప్రీపెయిడ్ మీటర్లు తీసుకువచ్చేందుకు... వ్యవసాయ మోటార్లకి మీటర్లు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ఉచిత విద్యుత్ ను ఎత్తి వేసేందుకు ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని అంబానీ, అదానీ వంటి ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పేందుకే రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. మోటార్లకు మీటర్లు పెట్టి పూర్తిగా రైతులకు ఉచిత విద్యుత్తును కాంగ్రెస్ ఎత్తగొట్టే కుట్ర చేస్తున్నదన్నారు. దీనితోపాటు ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రస్తుతం ఉన్న మీటర్లు తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు నిన్న క్యాబినెట్ లో మీటర్లన్నింటినీ తొలగించి ప్రీపెయిడ -మిగతా 3 లో

## తల్లికి వందనం నిధుల విడుదలకు సిద్ధం




- కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం తర్వాత నిధుల విడుదలకు ప్రభుత్వం సన్నాహాలు
- ఒక్కో విద్యార్థికి రూ. 13 వేలు తల్లుల ఖాతాల్లో జమ
- బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ లేకపోతే నిధులు ఆగే అవకాశం
- ఆన్‌లైన్ లోనే అర్హత, స్టేటస్ చెక్ చేసుకునే అవకాశం

అమరావతి: మే 24 (మహప్రభ)
ఆంధ్రప్రదేశ్‌లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం నిధుల విడుదలకు సన్నాహాలు ప్రారంభించింది. స్కూళ్లు, జూనియర్ కాలేజీలు ప్రారంభమైన కొద్ది రోజులకే 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిధులను విడుదల చేయనుంది. ఈ పథకం కింద ఒకటి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా నగదు జమ చేస్తుంది. మొత్తం రూ. 15 వేలలో రూ. 13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేయగా, మిగిలిన రూ. 2 వేలను పాఠశాలల నిర్వహణ ఖర్చుల కోసం కలెక్టర్ల ఆధ్వర్యంలోని ఖాతాలకు జమ చేస్తారు. -మిగతా 3 లో

# ఎబోలా విజృంభణ..


## -ఆఫ్రికా దేశాలకు వెళ్లేవారికి భారత్ కీలక సూచన



న్యూఢీల్లి 24 మే (మహప్రభ) ఆఫ్రికా దేశాల్లో ఎబోలా భారీగా విజృంభిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆఫ్రికా దేశాలకు వెళ్లే భారతీయులకు కీలక సూచన చేసింది. అత్యవసరమైతే తప్ప రిపబ్లిక్ ఆఫ్?ద కాంగో (డీఆర్సీ), ఉగాండా, సౌత్ సూడాన్ దేశాలకు వెళ్లకూడదని సూచించింది. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా విజృంభణపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా కీలక ప్రకటన చేసింది. పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్ అంటూ ఆఫ్రికాలో ఎబోలా విజృంభణ గురించి ప్రకటించింది. ఎబోలా వ్యాప్తిపై అంతర్జాతీయ అప్రమత్తత అవసరం అని పేర్కొంది. అంతేకాదు.. ద ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ కూడా ఎబోలా వ్యాప్తిపై పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ప్రస్తుతం డీఆర్సీ, ఉగాండాలలో బుండిబుగ్యో రకం ఎబోలా వైరస్ వ్యాపిస్తోంది. ఈ వైరస్ చాలా త్వరగా, సులభంగా వ్యాపిస్తుంది. ఇది రక్తం, వాంతులు, వీర్యం, చెమట, శరీరం నుంచి కారే ద్రవాలు వంటి వాటి వల్ల ఎబోలా ఒకరినుంచి ఇంకొకరికి వ్యాపిస్తుంది. జ్వరం, బలహీనత, కండరాల నొప్పులు, డయేరియాతోపాటు కొన్నిసార్లు రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇండియాలో కూడా ఈ విషయమై కేంద్రం అప్రమత్తంగా ఉంది. విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల్ని నిశితంగా పరిశీలిస్తోంది. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే పర్యాటకుల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల్ని పర్యవేక్షిస్తున్నారు.

# వైట్‌హౌస్ వద్ద కాల్పులు

## - దుండగుడు మృతి




న్యూఢీల్లి 24 మే (మహప్రభ) అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ వద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. యూఎస్ సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్‌పై ఓ ఆగంతకుడు కాల్పులకు తెగబడ్డాడు. భద్రతా సిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో అతను మరణించాడు. ఈ ఘటనలో ఒక పౌరుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం .... 17వ వీధి, పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద ఉన్న భద్రతా చెక్‌పాయింట్ వద్దకు వచ్చిన ఓ వ్యక్తి తన బ్యాగ్‌లోంచి తుపాకీ తీసి అక్కడున్న సీక్రెట్ సర్వీస్ అధికారులపై కాల్పులు జరిపాడు. తక్షణమే అప్రమత్తమైన అధికారులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపి నిందితుడిని నిలువరించారు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోనే ఉన్నారని, ఆయన సురక్షితంగా ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు. తీవ్రంగా గాయపడిన నిందితుడిని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు యూఎస్ సీక్రెట్ సర్వీస్ ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఈ కాల్పుల ఘటనలో గాయపడిన పౌరుడి పరిస్థితి విషమంగా ఉందని, అతనికి చికిత్స అందిస్తున్నామని తెలిపింది. దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) సహకారంతో దర్యాప్తు చేస్తున్నామని సీక్రెట్ సర్వీస్ అధికారులు వెల్లడించారు. కాల్పుల నేపథ్యంలో వైట్‌హౌస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేసి కొద్దిసేపటి తర్వాత ఎత్తివేశారు.

# పోస్టర్లపై అమ్మాయిల ఫొటోలు నాకుతూ ముద్దులు..

## వృద్ధుడి వికృత చేష్టలు వైరల్



న్యూఢీల్లి 24 మే (మహప్రభ) అమ్మాయిల భద్రత, సమాజంలో మహిళల పట్ల ఉన్న దృక్పథంపై మరోసారి సోషల్‌మీడియాలో ఓ చర్చ మొదలైంది. దేశంలో అమ్మాయిలకు బయటే కాదు.. పోస్టర్లపై కూడా రక్షణ లేకుండా పోయిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోస్టర్‌పై ఉన్న అమ్మాయిల ఫొటోలతో ఓ వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించిన వీడియో వైరల్ కావడమే ఇప్పుడు ఈ విమర్శలకు కారణమైంది. సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వీడియో ప్రకారం.. అమ్మాయిల ఫొటోలతో ఉన్న పోస్టర్లను అతికించిన డీజే వాహనం ఓ గ్రామంలోకి వెళ్లింది. అక్కడ ఓ వృద్ధుడు పోస్టర్లపై ఉన్న అందమైన అమ్మాయిల ఫొటోలను చూసి ఆపుకోలేకపోయాడు. వెంటనే ఆ వాహనం దగ్గరకు వెళ్లి యువతి పోస్టర్‌ను నాలుకతో నాకాడు. ముద్దులు పెట్టాడు. అంతటితో ఆగకుండా వాహనానికి మరోవైపు అతికించిన పోస్టర్ దగ్గరకు వెళ్లి అక్కడ కూడా అలాగే చేశాడు. ఈసారి పోస్టర్‌పై ఉన్న అమ్మాయి పెదాలకు లిప్‌కిస్‌లు పెడుతూ.. మొహం అంతా నాకుతూ మరింత అసభ్యంగా ప్రవర్తించాడు. చుట్టూ చిన్న పిల్లలు ఉన్నారన్నా కనీస ఇంగితం కూడా లేకుండా ఆ వృద్ధుడు చేసిన చర్యను అక్కడే ఉన్న కొంతమంది వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. వృద్ధుడి చేష్టలకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమ్మాయిలకు బహిరంగ ప్రదేశాల్లోనే కాదు.. పోస్టర్లపై కూడా రక్షణ లేకుండా పోయిందని విమర్శలు గుప్పించారు. ఇలాంటి వారి వల్లే సమాజంలో చిన్న పిల్లలపై కూడా అఘాయిత్యాలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండిపడుతున్నారు.

# వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీని ఎప్పటికి నమ్మొద్దు



చెన్నై 24 మే (మహప్రభ) : వీసీకే అధినేత, సీఎం విజయ్ మైనారిటీ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంపై డీఎంకే నాయకుడు, యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ ఆ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ..డీఎంకే కార్యకర్తల మద్దతు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వంతో సీట్లు గెలుచుకున్నప్పటికీ కాంగ్రెస్ నాయకులలో కనీస కృతజ్ఞత, మర్యాద కూడా లేదని మండిపడ్డారు. అధికారం కోసం పార్టీని నమ్మించి వెన్నుపోటు పొడిచే కాంగ్రెస్‌ను డీఎంకే క్యాడర్ ఎప్పటికీ నమ్మకూడదని, వారిని దరిదాపుల్లోకి కూడా రానివ్వొద్దని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఐదుగురు ఎమ్మెల్యేలను గెలవడానికి డీఎంకే కార్యకర్తలే కారణమన్నారు. ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకున్నందుకే వారికి ఓటు వేశారు. కానీ ఈరోజు, కొన్ని పదవుల కోసం, మాకు సమాచారం ఇవ్వకుండా వారు పారిపోయారు. తమిళనాడు ప్రజలు వారికి అతి త్వరలోనే తగిన గుణపాఠం నేర్పిస్తారన్నారు. భారతదేశవ్యాప్తంగా బీజేపీ ఎదుగుదలకు కాంగ్రెస్సే కారణమని కూడా ఆయన ఆరోపించారు. ఇన్నాళ్లు మోదీ, అమిషా వల్ల కాంగ్రెస్ ఓడిపోయింది అనుకున్నామని కానీ, నేటి పరిస్థితులు చూస్తుంటే కేవలం కాంగ్రెస్ మోసపూరిత విధానాల వల్లే దేశంలో బీజేపీ గెలుస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ గెలిచిన సీట్లు కూడా కేవలం స్టాలిన్ పెట్టిన భిక్షేనని గుర్తు చేశారు. జెన్ జెడ్ యూత్‌కు రాజకీయంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే తొలిసారి ఓటు వేసిన వారికి కూడా రాజకీయ చైతన్యం కల్పించాలని డీఎంకే యువజన విభాగం నేతలకు సూచించారు.

# ఈసారి ఖరీఫ్‌కు ఎల్‌నినో ఎఫెక్ట్..


## అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం



న్యూఢీల్లి 24 మే (మహప్రభ) ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉంటాయని, వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాబోయే ఖరీఫ్ సీజన్ లో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించింది. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జారీచేసిన ఆదేశాల ప్రకారం.. ప్రతి జిల్లాలో అక్కడి పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళికలు రూపొందించాలి. ముఖ్యంగా తక్కువ నీటితో, తక్కువ కాలంలో దిగుబడినిచ్చే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయల వంటి పంటల సాగును ప్రోత్సహించాలని సూచించింది. ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్న ప్రాంతాల్లో కరవును తట్టుకునే విత్తన రకాలను అందుబాటులో ఉంచాలని, విత్తన నిల్వలు, నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టంచేసింది. ఈసారి వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 92 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని, 35 శాతం వరకు కరవు పరిస్థితులు ఏర్పడవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనిపై ఇప్పటికే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ప్రస్తుతం దేశంలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటిమట్టాలు సంతృప్తికరంగా ఉండటం కొంత ఊరటనిచ్చే అంశమని చెప్పారు. కాగా రుతుపవనాలపై తుది అంచనాను వాతావరణ శాఖ ఈ నెలాఖరులో విడుదల చేసే అవకాశం ఉంది.

# ఏం క్రేజ్‌రా బాబూ..

## రీఎంట్రీ ఇచ్చిన 24 గంటల్లోనే సోషల్‌మీడియాను షేక్ చేసిన చైనా బ్యూటీ!



న్యూఢీల్లి 24 మే (మహప్రభ) ఈ చైనా బ్యూటీని చూస్తే ఏం క్రేజ్‌రా బాబూ అని అనాల్సిందే..! దాదాపు మూడేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చిన ఓ బ్యూటీ మేకప్ ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్‌మీడియాలోని షేక్ చేసేసింది. కొత్త ఖాతా తెరిచానని పోస్టు పెట్టిన 24 గంటల్లోనే దాదాపు కోటి ( 10 మిలియన్) మంది ఫాలోవర్లను సంపాదించి హాట్ టాపిక్‌గా నిలిచింది. జియాంగ్ చెంగ్‌లాన్ అనే చైనా యువతి సోషల్‌మీడియాలో ఒకప్పుడు చాలా ఫేమస్. చెంగ్షియన్ అనే పేరుతో ఆమె పెట్టే మేకప్ వీడియోలను అమ్మాయిలు, ఆంటీలు విపరీతంగా చూసేవాళ్లు. తక్కువ ఖర్చులో సింపుల్‌గా మేకప్ వేసుకునే టెక్నిక్స్ చెప్పడంతో ఆమె అప్పుడు పాపులర్ అయ్యింది. ఆ సమయంలో ఆమెకు 3 కోట్ల మంది ఫాలోవర్లు ఉండేవాళ్లు. కానీ ఏమైందో ఏమో కానీ మూడేళ్ల క్రితం సడెన్‌గా ఆమె సోషల్‌మీడియా నుంచి మాయమైపోయింది. 2023 మే నెల తర్వాత ఒక్క వీడియో కూడా పోస్టు చేయలేదు. దీంతో ఏమైందని ఫ్యాన్స్ కూడా అయోమయంలో పడిపోయారు. కానీ ఆమె నుంచి ఎలాంటి మెసేజ్ లేదు. అలా మూడేళ్లు గడిచిపోయాక రీసెంట్‌గా ఆమె తన పేరు(జియాంగ్ చెంగ్‌లాన్)తోనే సోషల్‌మీడియాలో అకౌంట్ ఓపెన్ చేసింది. తాను సోషల్‌మీడియాను ఎందుకు వదిలేయాల్సి వచ్చిందో వివరిస్తూ ఒక వీడియో పెట్టింది. ఇంకేముందు ఆ వీడియో చూడగానే తమ బ్యూటీ క్వీన్ మళ్లీ వచ్చేసిందని ఆమె ఫ్?న్స్ ఫాలో కొట్టడం మొదలుపెట్టారు. అలా కేవలం 24 గంటల్లోనే దాదాపు కోటి మంది ఫాలోవర్లను సంపాదించి చైనాలో సంచలనం సృష్టించింది. ఇక తాను పోస్టు చేసిన వీడియోలో పాత ఖాతాను ఎందుకు వదిలేయాల్సి వచ్చిందో వివరించింది. పాత కంపెనీతో నెలకొన్న వివాదం కారణంగానే అందులో నుంచి తప్పుకోవాల్సి వచ్చింది చెప్పింది. తన పాత ఆన్‌లైన్ నేమ్ చెంగ్స్యయన్ అనేది ఆ కంపెనీ ట్రేడ్‌మార్క్‌గా నమోదైందని తెలిపింది. ఇప్పుడు ఆ పేరుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. తనపై ఉన్న నమ్మకంతో ఆ బ్రాండ్ నుంచి ఉత్పత్తులు కొనవద్దని అభిమానులకు సూచించింది. ఇకపై మేకప్ పాఠాలతో పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ గురించి కూడా ఫ్యాన్స్‌తో పంచుకుంటానని తెలిపింది. అన్నట్లుగానే మరుసటి రోజే ఓ మేకప్ వీడియోను జియాంగ్ చెంగ్‌లాన్ పోస్టు చేసింది. ఆ వీడియోకు 44 లక్షలకుపైగా లైక్‌లు రావడం గమనార్హం. మరోవైపు జియాంగ్ రీఎంట్రీతో బ్యూటీ ప్రొడక్ట్ కంపెనీలు కూడా ఆమెతో టైఅప్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు పోరాటం ఆపను


## -రాహుల్ గాంధీ.. తీవ్రంగా స్పందించిన బీజేపీ



న్యూఢీల్లి 24 మే (మహప్రభ) నీట్ పేపర్ లీకేజీ ఘటనలో ప్రధాన బాధ్యుడిగా భావిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి డిమాండ్ చేశారు. ఆయన రాజీనామా చేయడం లేదా పదవి నుంచి తొలగించడం జరిగేంత వరకు తన పోరాటం ఆగబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. లక్షలాది మంది యువత వీధుల్లో ఉన్నప్పుడు.. 22 లక్షల మంది పిల్లల భవిష్యత్ ప్రమాదంలో ఉన్నప్పుడు ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించకుండా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు, భవిష్యత్‌లో ఇలా నీట్ పేపర్ లీకేజీ అరికట్టేలా తగిన చర్యలు తీసుకునేంత వరకు మా పోరాటం కొనసాగుతూనే ఉంది" అని రాహుల్ గాంధీ అన్నారు. నీట్ పేపర్ లీక్, రద్దు జరిగినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ విమర్శలు చేస్తూనే ఉన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. దేశంలో అస్థిరత సృష్టించేందుకు, మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకే రాహుల్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ విమర్శించింది. ప్రతిపక్షాలు, విదేశీ శక్తులు కలిసి రాహుల్ గాంధీ ద్వారా దేశంలో భారీ కుట్రకు తెరలేపాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. ఏడాదిలో ప్రభుత్వాన్ని కూల్చాలనుకుంటున్నారని చెప్పారు. దేశంలో అరాచకాన్ని వ్యాపింపజేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ప్రజలు వరుసగా బీజేపీకి మద్దతు తెలపడంతో కాంగ్రెస్ పార్టీ నిరాశలో ఉందన్నారు. రాహుల్, అతడి సన్నిహితులు దేశానికి వ్యతిరేకంగానే ఉంటారని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీని, ప్రతిపక్షాల్ని ఆయన టూల్ కిట్ గ్యాంగ్‌గా వర్ణించారు.

# డోర్లు తీయరు.. ఆస్తులు చెప్పరు!

## జనగణనలో వివరాల వెల్లడికి ప్రజల అయిష్టత



న్యూఢిల్లీ 24 మే (మహప్రభ) జనగణనలో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు! ఢిల్లీ మొదలుకొని పంజాబ్, మహారాష్ట్ర వరకు వివిధ రాష్ట్రాల్లో మండే ఎండల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.. చాలా మంది తమ ఆస్తులు, వ్యక్తిగత వివరాలను వెల్లడించడం లేదు. తలుపులు తీసి మాట్లాడటానికి నిరాకరిస్తున్నారు. ఆస్తులు, కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడిస్తే ఆదాయ పన్ను శాఖ లాంటి ఏజెన్సీలు స్క్రూటినీ చేస్తాయని భయపడుతున్నారు. దీంతో వాళ్లను సముదాయించడానికి మండే ఎండల్లో ఎన్యుమరేటర్లు అవస్థలు పడుతున్నారు. కొందరు అసంపూర్తి సమాచారం ఇస్తున్నారు. గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. జన గణనకు, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధం ఉందా అని వారు ప్రశ్నిస్తున్నా రు. నగరాల్లో చాలా మంది ఇంటి బయటే ఎన్యుమరేటర్లతో మాట్లాడుతున్నారు. గ్రామాల్లో మాత్రం చాలావరకు ఇంట్లోకి రానిచ్చి మాట్లాడుతున్నారు. మురికివాడల ప్రజలు మాత్రం ప్రభుత్వం తమకు కావాల్సిన సంక్షేమ పథకాలను అందిస్తుందన్న ఆశతో చాలా వివరాలను వెల్లడిస్తున్నారు

# ప్లే ఆఫ్స్‌కు రాజస్తాన్

**ముంబయిపై 30 పరుగులతో గెలుపు**
**జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండర్ షో**
**రాజస్తాన్ 205/8 ముంబయి 175/9**

**ముంబయి**
జోఫ్రా ఆర్చర్ (32, 15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు.. 3/17) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ముంబయి ఇండియన్స్‌పై రాజస్తాన్ రాయల్స్ 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ప్లే ఆఫ్స్‌కు చేరుకునేందుకు కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ సమిష్టిగా రాణించింది. లీగ్ దశలో ఎనిమిదో విజయంతో పాయింట్ల పట్టికలో నాల్గో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్ బెర్త్ దక్కించుకుంది. జోఫ్రా ఆర్చర్ నిప్పులు చెరగటంతో ముంబయి ఇండియన్స్ భారీ ఛేదనతో చతికిల పడింది. పవర్‌ప్లేలోనే ముంబయి ఇండియన్స్ అవకాశాలను ఆర్చర్ దెబ్బకొట్టాడు. సూర్యకుమార్ యాదవ్ (60, 42 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీకి తోడు విల్ జాక్స్ (33, 28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), హార్దిక్ పాండ్య (34, 15 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిసినా ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 179 పరుగులే చేసింది. రోహిత్ శర్మ (0), నమన్ ధిర్ (6), తిలక్ వర్మ (3), రియాన్ రికెల్టన్ (12) దారుణంగా నిరాశపరిచారు.



రాజస్తాన్ రాయల్స్ పేసర్లు జోఫ్రా ఆర్చర్, నండ్రె బర్గర్ (2/43), బ్రిజేశ్ శర్మ (2/26), యశ్ రాజ్ (2/44) క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టారు. ఏ దశలోనూ గెలుపు దిశగా సాగని ముంబయి ఇండియన్స్ ఓటమితో సీజన్‌ను ముగించింది.


**సమిష్టి ప్రదర్శన :**
తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ రాయల్స్ సమిష్టి ప్రదర్శనతో భారీ స్కోరు చేసింది. వైభవ్ సూర్యవంశీ (4) నిరాశపరచగా, యశస్వి జైస్వాల్ (27, 17 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఎదురుదాడి ఎంతోసేపు కొనసాగలేదు. ధ్రువ్ జురెల్ (38, 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), దశున్ శనక (29, 15 బంతుల్లో 3 సిక్స్‌లు), జోఫ్రా ఆర్చర్ (32), రవీంద్ర జడేజా (19 నాటౌట్, 11 బంతుల్లో 3 ఫోర్లు), బర్గర్ (10 నాటౌట్, 3 బంతుల్లో 1 సిక్స్) రాణించారు. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో శార్దుల్ ఠాకూర్ (2/41), దీపక్ చాహర్ (2/43) రాణించినా.. రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 205 పరుగులు చేసింది. రాయల్స్ బ్యాటర్లలో ఎవరూ అర్ధ సెంచరీ సాధించకపోయినా.. అందరూ సమిష్టిగా స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. టెయిలెండర్లు ఆర్చర్, బర్గర్, సహా జడేజా ఆఖర్లో విలువైన పరుగులు జోడించారు. దీంతో రాజస్తాన్ రాయల్స్ భారీ స్కోరు సాధించింది.

**సంక్షిప్త స్కోరు వివరాలు :**
రాజస్తాన్ రాయల్స్ : 205/8 (ధ్రువ్ జురెల్ 38, జోఫ్రా ఆర్చర్ 32, శనక 29, శార్దుల్ ఠాకూర్ 2/41, దీపక్ చాహర్ 2/43)
ముంబయి ఇండియన్స్ : 179/9 (సూర్యకుమార్ యాదవ్ 60, హార్దిక్ పాండ్య 34, విల్ జాక్స్ 33, జోఫ్రా ఆర్చర్ 3/17, బ్రిజేశ్ శర్మ 2/26)

# ఒప్పందానికి తొందరేం లేదు..

**-ఇరాన్-అమెరికా చర్చలపై ట్రంప్**
**-డీల్ కుదిరే వరకు ఇరాన్‌పై దిగ్బంధం కొనసాగుతుందని వెల్లడి**
**-60 రోజుల శాంతి ఒప్పందం దాదాపు ఖరారైనట్టు వార్తలు**
**-అణు నిల్వలు వదులుకునేందుకు ఇరాన్ ఒప్పుకొన్నట్టు ప్రచారం**

**కైరో,మే 24**
అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదురుతుందనే బలమైన ఆశల నడుమ చర్చలు నిర్మాణాత్మకంగా, క్రమబద్ధంగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం పేర్కొన్నారు. సమయం మనకు అనుకూలంగా ఉన్నందున ఒప్పందం విషయంలో తొందరపడవద్దని తన ప్రతినిధులకు సూచించినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఆయన ఒక పోస్ట్ చేస్తూ 'ఒప్పందం కుదిరి, ధ్రువీకరించి, సంతకం చేసే వరకు ఇరాన్‌పై దిగ్బంధం పూర్తి స్థాయిలో కొనసాగుతుంది. ఇరు పక్షాలు తగిన సమయం తీసుకుని దానిని సమర్థంగా చేయాలి. ఎలాంటి తప్పులు ఉండరాదు' అని పేర్కొన్నారు. ఇరాన్‌తో వాషింగ్టన్ సంబంధాలు




పూర్తి స్థాయి నిర్మాణాత్మకంగా మారబోతున్నాయన్నారు. వారు అణు ఆయుధం, అణు బాంబును అభివృద్ధి చేయలేరు' అని తెలిపారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, భద్రతా సంబంధాలను నెలకొల్పే అబ్రహం ఒప్పందాల్లో చేరాలని కోరారు.

**యుద్ధం ముగింపు?**
60 రోజుల ప్రతిపాదిత ఒప్పంద వివరాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివరించనప్పటికీ తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను వదులుకునే కీలక ప్రతిపాదనకు ఇరాన్ అంగీకరించిందని ఒప్పందంలో భాగస్వాములైన ఇద్దరు అధికారులు వెల్లడించారు. చర్చలు జరుగుతున్న విషయాన్ని ఇరాన్ రేడియో కూడా నిర్ధారించింది. ఇదే నిజమైతే ఇరాన్-అమెరికా యుద్ధానికి బ్రేక్ పడినట్టే. 60 రోజుల కొత్త శాంతి ఒప్పందం ప్రకారం హెర్ముజ్ జలసంధిని క్రమంగా తెరుస్తారు. అదే సమయంలో ఇరాన్ పోర్టుల దిగ్బంధాన్ని అమెరికా కూడా ఉపసంహరించుకుంటుంది. అంతేకాకుండా ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేసి ఆ దేశం చమురు అమ్మకాలు యథావిధిగా కొనసాగించేలా అనుమతి ఇస్తారు. 60 రోజుల శాంతి ఒప్పందం అమలవుతున్న రోజుల్లోనే స్తంభింప చేసిన ఇరాన్ నిధుల విడుదలకు సంబంధించి కూడా చర్చలు జరుగుతాయి. ముసాయిదా ఒప్పందంలో ఇజ్రాయెల్, హెజ్బొల్లా యుద్ధ విరమణ అంశం కూడా ఉంది. తమకు కలిగే ముప్పునకు వ్యతిరేకంగా తమ కార్యాచరణను కాపాడుకుంటామని ట్రంప్‌నకు నెతన్యాహు తెగేసి చెప్పారు.

# పాక్‌లో మరోమారు ఉగ్రకలకలం

**-జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా భారీ పేలుడు**
**-సైనికుల ఫ్యామిలీలు వెళ్తుండగా విషాదం**
**-24 మంది మృతి, సహాయకచర్యలు ఆరంభించిన ఆర్మీ**
**-దాడికి బాధ్యత వహించిన బలోచ్ లిబరేషన్ ఆర్మీ**
**-సైనికులు, వారి కుటుంబాలే ప్రధాన టార్గెట్‌గా వెల్లడి**

**క్వెట్టా**
పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రదాడి కలకలం రేపింది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా ప్రాంతంలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై జరిగిన భారీ బాంబు దాడిలో కనీసం 24 మంది ప్రాణాలు కోల్పోగా, 80 మందికిపైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటన ఆదివారం ఉదయం చమన్ ఫాటక్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మృతుల్లో ఎక్కువ మంది సైనికులు ఉన్నట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం, జాఫర్ ఎక్స్‌ప్రెస్ క్వెట్టా కాంటోన్మెంట్ స్టేషన్ నుండి సిటీ రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న సమయంలో పేలుడు సంభవించింది. ఈద్ పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఈ రైలులో ప్రయాణిస్తున్నారు. రైలు సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నిండిన ఓ వాహనం రైలు బోగీని ఢీకొట్టడంతో భారీ పేలుడు సంభవించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పేలుడు తీవ్రత ఎంతగా ఉందంటే, రైలు ఇంజిన్‌తో పాటు మూడు బోగీలు పట్టాలు తప్పాయి. అందులో రెండు బోగీలు పూర్తిగా బోల్తా పడ్డాయి. పేలుడు ధాటికి సమీపంలోని వాహనాలు, భవనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. 10కి పైగా వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయని స్థానిక మీడియా వెల్లడించింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ



బృందాలు, పోలీసులు, భద్రతా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. శిథిలాల మధ్య చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**నగరంలో హైఅలర్ట్**
ఈ ఘటన తర్వాత క్వెట్టా నగరంలో హైఅలర్ట్ ప్రకటించారు. మరోవైపు పేలుడు ప్రాంతంలో ప్రజలు గుమిగూడవద్దని పాక్ హోంశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా సాయుధ దళాలను మోహరించారు. భద్రతా కారణాల దృష్ట్యా క్వెట్టా నుంచి పెషావర్కు వెళ్లాల్సిన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే స్టేషన్‌లోనే నిలిపివేశారు. ఇదిలా ఉండగా, ఈ దాడికి తామే బాధ్యులమని నిషేధిత బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ప్రకటించింది. క్వెట్టా కాంటోన్మెంట్ నుంచి సైనికులను తరలిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకున్నామని బీఎల్‌ఏ ప్రతినిధి జీయాండ్ బలోచ్ వెల్లడించారు. పాక్ ప్రభుత్వం బలోచ్ ప్రజలను అణచివేస్తోందని, తమ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. తమ మాతృభూమి విముక్తి కోసం పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

**దాడిని ఖండించిన పాక్ రైల్వే మంత్రి**
పాకిస్తాన్ రైల్వే మంత్రి హనీఫ్ అబ్బాస్ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ఇది పిరికిపందల చర్య అని వ్యాఖ్యానించారు. దేశంలో భయాందోళనలు సృష్టించడమే ఉగ్రవాదుల లక్ష్యమని అన్నారు. ఇలాంటి దాడులతో దేశ ప్రజల ధైర్యసాహసాలను దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. ఉగ్రవాదులను మానవత్వానికి శత్రువులుగా అభివర్ణించిన ఆయన, వారిని కఠినంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ గత కొన్నేళ్లుగా మిలిటెంట్ గ్రూపుల టార్గెట్‌గా మారుతోంది. ముఖ్యంగా బలోచ్ రెబెల్స్, తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఈ రైలుపై పలుమార్లు దాడులకు పాల్పడ్డాయి. క్వెట్టా నుంచి పంజాబ్ ప్రాంతాలకు సైనికులను తరలించేందుకు ఈ రైలును తరచూ ఉపయోగిస్తుండటంతో మిలిటెంట్లు దీన్ని లక్ష్యంగా చేసుకుంటున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. 2018లో ఈ రైలుకు సమీపంలో రెండు బాంబులు పేలగా, రిమోట్ కంట్రోల్ సాయంతో దాడి చేసినట్లు అప్పట్లో వెల్లడైంది. 2023లో బోలాన్ జిల్లాలో రైలులో బాంబు పేలి 13 మంది గాయపడ్డారు. అదే ఏడాది మరోసారి జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై పేలుడు దాడి చోటుచేసుకొని ఒకరు మరణించారు. 2024లో క్వెట్టా రైల్వే స్టేషన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే 2025లో బోలాన్ జిల్లాలో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ ఘటన కూడా సంచలనం సృష్టించింది. ఆ సమయంలో వందలాది మంది ప్రయాణికులను భద్రతా దళాలు సురక్షితంగా రక్షించాయి

## ప్రస్తుతం ప్రపంచం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది

మొదటి తరువాయి

భారతదేశంలో కేవలం 10 శాతం మేర మాత్రమే క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి జరుగుతుండగా, మిగతా అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగినప్పటికీ, భారత్‌లో మాత్రం ఇంధన ధరల పెరుగుదల చాలా పరిమితంగానే ఉండటం కేంద్ర ప్రభుత్వ సమర్థ నిర్వహణకు నిదర్శనమన్నారు. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరగానే కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమి, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ విమర్శలకు దిగుతున్నాయని విమర్శించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించకుండా కేవలం రాజకీయ లాభాల కోసం భయాందోళనలు సృష్టించడం బాధ్యతారాహిత్య రాజకీయమని అన్నారు. ప్రపంచ దేశాల్లో ఇంధన ధరలు భారీగా పెరిగాయని, యూరప్‌లోని పలు దేశాల్లో 15 శాతం నుంచి 26 శాతం వరకు ధరలు పెరిగాయని తెలిపారు. బ్రిటన్‌లో డీజిల్ ధరలు 28 శాతం, పెట్రోల్ ధరలు 25 శాతం వరకు పెరిగాయని చెప్పారు. పాకిస్తాన్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారి డీజిల్ ధరలు 54.9 శాతం, పెట్రోల్ ధరలు 42.7 శాతం వరకు పెరిగాయని గుర్తుచేశారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో అక్కడి ప్రభుత్వం సబ్సిడీలు కొనసాగించడం సాధ్యం కాదని స్వయంగా ప్రకటించిందన్నారు.

## తల్లికి వందనం నిధుల విడుదలకు సిద్ధం

మొదటి తరువాయి

ఒక్కో విద్యార్థికి రూ. 13 వేల చొప్పున ఆర్థిక సాయం అందనుంది. ఇద్దరు పిల్లలు ఉంటే రూ. 26 వేలు, ముగ్గురు పిల్లలు ఉంటే రూ. 39 వేలు, నలుగురు పిల్లలు ఉంటే రూ. 52 వేల వరకు లబ్ధి పొందే అవకాశం ఉంది. అయితే గతడాది అర్హతలు ఉన్నప్పటికీ కొంతమంది తల్లులకు నిధులు అందలేదు. ముఖ్యంగా బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ లేకపోవడం ప్రధాన కారణంగా గుర్తించారు. దీంతో ఈసారి ముందుగానే బ్యాంక్-ఆధార్ లింక్ సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లబ్ధిదారులు సంబంధిత బ్యాంకుకు వెళ్లి తమ ఖాతాకు ఆధార్ లింక్ అయిందో లేదో తెలుసుకోవచ్చు. లింక్ లేకపోతే ఆధార్ సీడింగ్ లేదా ఎన్‌పీసీఐ లింకేజ్ ఫారం నింపి బ్యాంకులో సమర్పించాలి. ప్రక్రియ పూర్తయిన తర్వాత మొబైల్‌కు మెసేజ్ వస్తుంది. అలాగే ఆన్‌లైన్‌లో కూడా ఆధార్ బ్యాంక్ సీడింగ్ స్టేటస్ తెలుసుకునే అవకాశం ఉంది. "మై ఆధార్" సేవల్లోకి వెళ్లి ఆధార్ సర్వీసెస్ వెళ్లి చెక్ ఆధార్ బ్యాంకు సీడింగ్ స్టేటస్ ఎంపికను చేసుకోవాలి, ఆధార్ నంబర్ మరియు క్యాప్చా నమోదు చేయాలి. అనంతరం మొబైల్‌కు వచ్చే ఓటీపీ నమోదు చేస్తే ఆధార్ ఏ బ్యాంక్ ఖాతాకు లింక్ అయిందో తెలుస్తుంది.

## మహిళా సంఘాలకు భారీ రుణాలు

మొదటి తరువాయి

అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. ఈ క్రమంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళలు, దళిత, గిరిజన, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు.

## తెలంగాణలో భానుడి ఉగ్రరూపం

మొదటి తరువాయి

(టి)లో 46.5 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్, సూర్యాపేట సహా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46.4 డిగ్రీలుగా రికార్డయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలోని 16 జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46.2 నుంచి 46.5 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. నిన్న ఒక్కరోజే 244 మండలాల్లో తీవ్రమైన ఎండల ప్రభావం కనిపించింది. సూర్యాపేట జిల్లాలోని 22 మండలాల్లో, మంచిర్యాల, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో 18 చొప్పున మండలాల్లో వడగాలులు వీచాయి.సాధారణంగా సూర్యాస్తమయం తర్వాత వాతావరణం చల్లబడుతుంది. కానీ, గాలిలో తేమ శాతం పూర్తిగా పడిపోవడంతో రాత్రిపూట కూడా వేడి సెగలు, ఉక్కపోత తగ్గడం లేదు. గురువారం రాత్రి హైదరాబాద్, హకీంపేట, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి ప్రధాన నగరాల్లో సాధారణం కంటే 2.7 నుంచి 4.7 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు రాత్రుళ్ళు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి), విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించాయి. ఈనెల 26 వరకు పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొన్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లల విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు

మొదటి తరువాయి

మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యం, పోషణ, పారిశ్రామిక ప్రగతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. మహిళా వారోత్సవాల సందర్భంగా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలు, సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రదర్శనలు, ఆరోగ్య శిబిరాలు, యువతులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సాధికారత కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామిక వేత్తలుగా, సంపద సృష్టికర్తల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పంచాయతీ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.ధనసరి అనసూయ సీతక్క మార్గదర్శకత్వంలో మహిళా సంఘాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. మహిళా సంఘాలకు ఈ ఐదేళ్లలో బ్యాంక్ లింకేజీ ద్వారా లక్ష కోట్ల రూపాయల రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల రుణాలు అందించారు. వీటి ద్వారా లక్షల సంఖ్యలో మహిళలు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1397 కోట్ల వడ్డీ రాయితీ మహిళా సంఘాలకు ప్రభుత్వం చెల్లించింది. మహిళా వారోత్సవాల్లో మరో రూ.650 కోట్లను చెల్లించనున్నారు. 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమం ద్వారా మహిళలను స్వయం ఉపాధి రంగంలో బలోపేతం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 222 మహిళా సంఘాల క్యాంటీన్లు ఏర్పాటు కాగా... ఒక్కో యూనిట్ నెలకు సగటున రూ.72 వేల వరకు లాభాలు ఆర్జిస్తోంది. మహిళల నిర్వహణలో పెట్రోల్ బంకులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే రెండు యూనిట్లు ప్రారంభం కాగా... మరో 30 పెట్రోల్ బంకుల నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయి. మహిళా సమాఖ్యలు రూ.199 కోట్ల పెట్టుబడితో 553 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన టీజీఎస్ఆర్టీసీకి అందించాయి. ఒక్కో బస్సు ద్వారా నెలకు సుమారు రూ.70 వేల వరకు ఆదాయం లభిస్తోంది. అలాగే వరి కొనుగోలు కేంద్రాలు, పాల విక్రయ కేంద్రాలు, మైక్రో వ్యాపారాలు, ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థల ద్వారా మహిళలు ఆదాయం పెంచుకుంటున్నారు. గ్రామీణ మహిళలను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సెర్ప్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

## మోటార్లకు మీటర్లను పెడుతున్న సర్కార్

మొదటి తరువాయి



మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నది క్యాబినెట్. మొత్తం గ్రామాల్లో, పట్టణాల్లో వ్యవసాయాలకు ప్రీపెయిడ్ మీటర్లు వేస్తామన్నారు. మోటార్లకు మీటర్లు రాకముందే... ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రీపెయిడ్ మీటర్లు తేక ముందే కాంగ్రెస్ పార్టీ పూజ్యులు తీసివేయాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంత ఒత్తిడి చేసినా, 30 వేల కోట్ల రూపాయల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఆపినా కేసీఆర్ ఎదిరించారు, మీటర్లు పెట్టలేదు. కానీ, రానున్న మూడు నెలల్లోనే మొత్తం మీటర్లు పెడతామని చెప్పి నిన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ఉచిత కరెంట్ ను ఎ గొట్టడం కోసమే ప్రీపెయిడ్ మీటర్లను తీసుకువస్తుందని కేటీఆర్ ఆరోపించారు. అడ్డగోలు హామీలు ఇచ్చి, అడుగడుగునా అరాచకాలు, అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్ కి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఖచ్చితంగా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదుకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామన్నారు. ఫ్యూచర్ లేని ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ కడతా అంటే పట్టించుకునేది ఎవరు అని ప్రశ్నించారు.మరోవైపు హైదరాబాద్ నగరంలో మూసి ప్రక్షాళన చేస్తా అంటున్న ముఖ్యమంత్రి ఆలోచన పైన, ప్రణాళికల పైన కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఇప్పటికే దాదాపు గత ప్రభుత్వం హయాంలోనే సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు కట్టి, దాదాపుగా పూర్తయిన మూసీ నది ప్రక్షాళన పేరుతో లక్షల కోట్ల రూపాయలు దోచుకునేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్ చేస్తున్నాడని ఆరోపించారు. ఆల్రెడీ ముగిసిపోయిన మూసి ప్రక్షాళన పైన రేవంత్ రెడ్డి కేవలం కాంట్రాక్ట్ కమిషన్ కోసమే మాట్లాడుతున్నారు అన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వం మూసి పైన ఎస్టీపీల నిర్మాణము, బ్రిడ్జిల నిర్మాణము వంటివన్నీ ప్రారంభించిన తర్వాత, ఇప్పుడు మళ్లీ లక్షన్నర కోట్లతో మూసి ప్రక్షాళన పేరుతో నాటకాలు ఎందుకు అని కేటీఆర్ ప్రశ్నించారు.

# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి



గత వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో వివాదాలు, విద్వేష దూషణలూ పరాకాష్టకు చేరాయి. అధికారంలో వున్న, కోల్పోయిన పాలక పార్టీల కీలక నేతలు, మాజీ ప్రస్తుత ముఖ్యమంత్రులే గాక కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వ మంత్రులు కూడా ఈ వివాదాలకు ప్రత్యక్ష, పరోక్ష కారకులు కావడం విశేషం. ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్‌లో సభకు హాజరై ఏపీ ముఖ్యమంత్రినీ, ఉప ముఖ్య మంత్రినీ కలిసి వెళ్లిన వెనువెంటనే ఈ పరిస్థితి రావడం యాదృచ్ఛికం కాదు. ఈ వివాదాలలో బయటి పరిణామాలు మాత్రమే గాక పాలకపార్టీలు అంతర్గతంగానూ మల్లగుల్లాలు పడవలసిన పరిస్థితి మరింత ప్రాధాన్యత కలిగింది. ఈ క్రమంలో పదవులు, ఉద్వాసనలూ, పొత్తులూ, ఎత్తులూ అన్నిటిపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. రూ.వేలకోట్ల విలువైన ప్రజాధనంతో నడిచే నిర్మాణాలూ, ప్రాజెక్టులూ, కేటాయింపులు కూడా సందేహాలకు గురవుతువున్నాయి. ప్రస్తుత మీడియా స్వభావరీత్యానే ఈ విధమైన మౌలిక సమస్యలు వదిలేసి పరస్పర వివాదాలు పార్టీల తగాదాలకు పెద్దపీట వేస్తుంటే నిజమైన సమస్యలపై కేంద్రీకరణ, ప్రజల ఆస్తుల రక్షణ, ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణ వంటి అంశాలు వెనక్కుపోతున్నాయి.

**బీజేపీ ఇరకాటం, బీఆర్ఎస్ దాడి**

ప్రధానమంత్రి సభ నాటికే కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసుపై తెలంగాణ రగిలిపోతున్నది. చాలాకాలం కిందటే తలిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు త్వరితంగా రంగంలోకి దిగలేదు. పైగా సదరు మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని సభలోనే పాల్గొనగలిగారు. ప్రధాని పర్యటన సందర్భంగా బీజేపీ సభలోనైతే సంజయ్ మాట్లాడుతూ తన కుటుంబంపై కుట్రలు జరుగుతున్నాయని ఎదురుదాడి కూడా చేశారు. అప్పటికే పోక్సో కేసుపై అలజడి పెరగడంతో రేవంత్ రెడ్డి పోలీసులకు ఆదేశాలిచ్చినట్టు వార్త ప్రసారమైంది. ప్రధాని పర్యటన భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైన కారణంగా ఈ కేసుపై దృష్టి పెట్టలేకపోయామని డిజిపి వివరణ ఇచ్చారు. అయితే తర్వాత కూడా రెండు మూడు రోజుల దాకా ఏ చర్య లేదు సరికదా కేంద్రమంత్రి ఏక్తాయాత్ర అంటూ జరిపి అక్కడ జైశ్రీరాం నినాదాల మధ్య తనను తాను సమర్థించుకుంటూ విమర్శకులకు హెచ్చరికలు చేశారు. భక్తి పేరిట జరిపిన యాత్రలో పోక్సో కేసు సమర్థనలతో మాట్లాడటం బీజేపీ అభిమానులే జీర్ణించు కోలేకపోయిన పరిస్థితి. ఇదే సమయంలో అతన్ని ముఖ్యమంత్రి ఇంట్లోనే దాచి వుంచారని బీఆర్ఎస్ నాయకులొకరు ఆందోళన చేయబోయి అరెస్టయ్యారు. ఈ ఘటనలో బాధితురాలు మైనర్ కాదంటూ విపరీతంగా పోస్టులు ట్రోల్స్ గుప్పించారు. కొందరు మహిళా యూట్యూబర్లతో సహా సోషల్‌మీడియా, కొన్ని ఛానళ్లు బండిని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశాయి. కేసీఆర్ కుటుంబానికి బండి సంజయ్‌కి కూడా స్వంత జిల్లా అయిన కరీంనగర్‌లో దీనిపై రెండు పార్టీల మధ్య తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. చివరకు హైకోర్టు బెయిల్ నిరాకరించాక గానీ భగీరథ్ అరెస్టు కాలేదు. భగీరథ్‌ను అరెస్టు చేశామని పోలీసులు చెబుతుంటే తానే అప్పగించానని సంజయ్ చెప్పుకున్నారు. చివరకు ముఖ్యమంత్రి కూడా దీన్ని ఖండించవలసి వచ్చింది. అయితే మైనర్ బాలికకు సంబంధించిన విషయంలో తాము జాగ్రత్త తీసుకుంటే బీఆర్ఎస్ మాత్రం ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిం చినట్టు రాజకీయ స్వార్థంతో దాడి చేస్తున్నదని కూడా ముఖ్యమంత్రి విమర్శించారు. బీజేపీతో బీఆర్ఎస్‌కే సంబంధాలున్నాయని, అందుకే కాళేశ్వరం తప్పులపై ఎలాంటి చర్యకు సిద్ధం కాలేదని కాంగ్రెస్ ఆరోపణ. కాంగ్రెస్ కావాలనే కేసీఆర్‌పై తీవ్రమైన ఆరోపణలను పక్కనపెట్టి వేరే వాటిపై విచారణ తతంగాలు జరుపుతున్నదని బీజేపీ ఎదురుదాడి. ప్రధాని పర్యటనలో ముఖ్యమంత్రిని మాతో కలవండని పిలుపునివ్వడంపైనా చాలా చర్చలు నడిచాయి. బీఆర్ఎస్ తీవ్రమైన కుమ్మక్కు ఆరోపణలు చేస్తుంటే ముఖ్యమంత్రి తేలిగ్గా తోసిపుచ్చారు. మొన్నటి దఫా ఎన్నికల తర్వాత తెలంగాణ తమ టార్గెట్ అంటూ హడావుడి చేస్తున్న బీజేపీకి బండి సంజయ్ వివాదం నష్టదాయకమని, ఆయన్ను పదవినుంచి తప్పించాలని ఆ పార్టీలోనే ముసలం పుట్టిన సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు తప్ప ప్రముఖ నేతలెవరూ దీనిపై పెద్దగా స్పందించడం లేదు. ఆయన్ను ఢిల్లీ పిలిపించి మరీ చర్చలు జరపడంతో తొలగింపు కథనాలకు బలమొచ్చింది.

**రేవంత్ వ్యూహాలు**

బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి గతంలో చేసినట్టు రేవంత్ రెడ్డి తమ పార్టీ నేతలతో టచ్‌లో వుండొచ్చని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సెలవిచ్చారు. బీఆర్ఎస్ ఏపీలో వైసీపీ నేత జగన్‌తో కలసి పనిచేస్తున్నదని ఒకవైపు, రేవంత్ రెడ్డి గత సంబంధాలను బట్టి చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మరోవైపు కథనాలు సాగుతూనే వున్నాయి. బీజేపీ- ఆరెస్సెస్‌ల మత రాజకీయాలు, ఇటీవల మళ్లీ కాంగ్రెస్‌కు చేరువైన మజ్లిస్ నేతల మత పాచికలు తరచూ ప్రభావం చూపిస్తున్నాయి. వీటన్నిటి మధ్యనా కార్మికుల పోరాటాలు, విద్యా వైద్య సమస్యలు పేరుకుపోయిన బకాయిలు వంటివి తెరమరుగై పోతున్నాయి. రాజధాని శివార్లలో మంచిరేవుల, మహేశ్వరం వంటి చోట్ల భూమి స్కాములు జరిగాయనే పోటాపోటీ కథనాల మధ్య తాజాగా ఈ.డి కూడా ఒక విచారణ చేపట్టింది. అధికార పార్టీలో విభేదాల కథలు షరామామూలే. అడపాదడపా ప్రకటనలు మినహాయిస్తే కాంగ్రెస్ తన ప్రధాన జాతీయ ప్రత్యర్థి అయిన బీజేపీ మత రాజకీయాలపై,కేంద్రం పెత్తనంపై గట్టిగా కార్యక్రమాలు తీసుకున్నది నామమాత్రమే. 2034 వరకూ అంటే వచ్చే ఎన్నికల తర్వాత మరో దఫా తనే అధికారం చేపట్టి ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి పోతానన్నది రేవంత్ మాట. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి బెంగళూరు మకాం మార్చి మళ్లీ లోటస్‌పాండ్‌కు రానున్నారనే వార్తలు కూడా దీంతో పాటే వినిపిస్తున్నాయి. సన్నిహితులుగా పేరున్న కొంతమంది మంత్రులతో సంబంధాలు నెరపడమే గాక సమీకరణలకు తోడవుతున్నారనేది ఆయనపై పరిశీలకుల వ్యాఖ్య.

# తమిళనాడు సీఎం విజయ్ కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారా..?

**న్యూఢిల్లీ 24మే (మహాప్రభ):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన ప్రముఖ నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించారా..? ముందుగా కర్ణాటక రాజకీయాల్లో ఎంట్రీ ఇవ్వబోతున్నారా..? తన పార్టీ టీవీకే విస్తరణలో భాగంగా ఆయన త్వరలో జరగబోయే బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ (దీదీవీూ) ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నారా..? ఈ ప్రశ్నలన్నింటికీ తమిళనాడులోని టీవీకే వర్గాలు అవుననే సమాధానం చెబుతున్నాయి. కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి సంకల్పంతో ఉన్నట్లు ఆయన పార్టీ వర్గాలు అంటున్నాయి. ఐటీ హబ్ అయిన బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు.




అంతేకాకుండా నటుడిగా విజయ్‌కి కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది. ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో టీవీకే సాధించిన చారిత్రాత్మక విజయాన్ని బెంగళూరులోని విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సానుకూలతలను ఓట్లుగా మార్చుకుని, అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని టీవీకే అధిష్ఠానం భావిస్తున్నట్లు ఆ పార్టీలో ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. కర్ణాటక రాజకీయాల్లోకి టీవీకే ఎంట్రీ ఇస్తుందనే వార్తలు బెంగళూరు రాజకీయ వర్గాల్లో అప్పుడే ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ.. దీనిపై విజయ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీని ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ ముందడుగు ఉండబోతోందని, త్వరలోనే బెంగళూరు ఎన్నికల పోటీపై టీవీకే స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..

**హైపర్‌సోనిక్ ఒరెష్నిక్ ఆయుధాన్ని ప్రయోగించిందా..?**

**న్యూఢీల్లి 24మే (మహాప్రభ):** రష్యా--ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చింది. ఉక్రెయిన్‌పై రష్యా ఆదివారం భీకర దాడులకు దిగింది. ఈసారి అత్యంత ఆధునికమైన, శక్తివంతమైన హైపర్ సోనిక్ ఆయుధాన్ని ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై రాత్రిపూట మిస్సైల్స్, డ్రోన్ల దాడితో రష్యా విరుచుకుపడింది. ఈ దాడుల్లో నగరంలో భారీ నష్టం జరగగా, ఇద్దరు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. పట్టణంలోని స్కూళ్లు, నివాస బిల్డింగులు, మార్కెట్లు, ప్రభుత్వ కార్యాలయాలపై ఈ దాడి జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. రష్యా తన వద్ద ఉన్న




అత్యాధునిక హైపర్ సోనిక్ మిస్సైల్ ప్రయోగించినట్లు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఇతర మిస్సైళ్లు, డ్రోన్లతోపాటు ఒరెష్నిక్ మిస్సైల్‌ను కూడా ప్రయోగించిందని జెలెన్‌స్కీ ఆరోపించారు. వివిధ రకాల 90 మిస్సైల్స్ ప్రయోగించిందని, అందులో 36 బాలిస్టిక్ మిస్సైల్స్ కూడా ఉన్నాయని జెలెన్‌స్కీ అన్నారు. అలాగే, 600 డ్రోన్లు ప్రయోగించిందన్నారు. అయితే, వాటిలో చాలా వరకు తాము అడ్డుకోగలిగామని వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని మిలిటరీ కమాండ్ సెంటర్లు, ఎయిర్ బేస్‌లు, రక్షణ శాఖ స్థావరాలపై దాడి చేశామని రష్యా రక్షణ శాఖ మంత్రి వెల్లడించారు. ఇటీవల రష్యాలోని నివాస స్థలాలపై ఉక్రెయిన్ దాడి చేయడం వల్లే తాము ప్రతిదాడులు చేశామని రష్యా తెలిపింది. హైపర్‌సోనిక్ ఒరెష్నిక్ మిస్సైల్ ప్రయోగించినట్లు రష్యా రక్షణ శాఖ మంత్రి కూడా అంగీకరించారు. ఇది చాలా శక్తివంతమైనది. దాదాపు 3,000 కిలోమీటర్ల నుంచి 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా చేధించగలదు. ఇది శబ్దవేగంకంటే పది రెట్లు వేగంగా ప్రయాణిస్తుంది. దీన్ని మొదట 2002లో, ఆ తర్వాత 2025లో ప్రయోగించింది. ఇవి చాలా ప్రభావవంతమైనవి కావడంతో ఉక్రెయిన్‌కు భారీ నష్టం కలిగినట్లు తెలుస్తోంది.

# ప్రతి దేశంలో మూర్ఖులు ఉంటారు..

**వీసాల విషయంలో భారతీయుల్ని లక్ష్యంగా చేసుకోలేదు: మార్కో రుబియో**

**న్యూఢీల్లి 24మే (మహాప్రభ):** ఇటీవలి కాలంలో హెచ్1బీ వీసాలు సహా అనేక అంశాల్లో అమెరికా కొత్త నిబంధనలు రూపొందించిన సంగతి తెలిసిందే. అమెరికాలో ఉంటున్న చాలా మందికి గ్రీన్ కార్డులు రాక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రశ్నించారు. అయితే, తాము కొత్త నిబంధనల పేరుతో ఇండియాను టార్గెట్ చేయలేదని రుబియో అన్నారు. అమెరికా, ఇండియా విదేశీ మంత్రుల మధ్య న్యూఢిల్లీలో ఆదివారం చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా అనేక అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు.



ఇటీవల అమెరికా టూరిస్ట్ వీసాలు, హెచ్1బీ వీసాల్లో ఇండియన్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రుబియో దృష్టికి జైశంకర్ తీసుకెళ్లారు. దీనిపై రుబియో స్పందిస్తూ.. తాము ఇండియాను ప్రత్యేకంగా టార్గెట్ చేయలేదని, తమ నిబంధనలు అన్ని దేశాలకు వర్తిస్తాయన్నారు. ఇండియన్స్‌పై అమెరికాలో జరుగుతున్న జాతి వివక్ష దాడులపై కూడా ఆయన మాట్లాడారు. ప్రతి దేశంలో కొందరు మూర్ఖులు ఉంటారని, ఇండియాలోనూ, అమెరికాలోనూ ఉన్నారని, అలాంటి కొద్ది మంది చేసే పనులు తమ దేశపు విధానాన్ని ప్రతిబింబించబోవని అన్నారు. వలసదారులతో అమెరికా స్నేహబంధాన్ని కొనసాగిస్తుందన్నారు. ఇలాంటి ఘటనల్ని తీవ్రం గా పరిగణిస్తామని, వ్యక్తిగతంగా జరిగే ఈ దాడులు తమ దేశ సంస్కృతికి సంబంధించినవి కావు అన్నారు. తమ దేశం అందరినీ స్వాగతిస్తుందని చెప్పారు. అమెరికా ఆర్థికాభివృద్ధిలో భారతీయులు ఎంతో కృషి చేశారని, ఇది భవిష్యత్‌లో కూడా కొనసాగాలని భావిస్తున్నట్లు రుబియో వెల్లడించారు. అమెరికాలో 2 కోట్ల మంది వరకు అక్రమంగా వలస వచ్చి ఉంటున్నారని, అందువల్లే నిబంధనలు మార్చామని రుబియో చెప్పుకొచ్చారు. అక్రమ వలసల్ని నియంత్రించేందుకు అమెరికాకు ఇండియా అండగా నిలుస్తుందని జైశంకర్ పేర్కొన్నారు.

# కర్ణాటకలో ఘోర విషాదం

**-ముత్యపు చిప్పల కోసం వెళ్లిన కుటుంబం నదిలో గల్లంతు..**
**- ఏడుగురు మహిళలు సహా ఎనిమిది మంది మృతి**



**న్యూఢీల్లి 24మే (మహాప్రభ):** కర్ణాటకలో ఘోర విషాధం జరిగింది. నదిలో ముత్యపు చిప్పల కోసం వెళ్లిన ఒకే కుటుంబానికి చెందినఎనిమిది మంది మరణించారు. ఇంకో ఇద్దరు గల్లంతైనట్లు తెలుస్తోంది. మృతుల్లో ఏడుగురు మహిళలు ఉన్నారు. ఈ ఘటన కర్ణాటక, ఉత్తర కన్నడ జిల్లా, భట్కాల్ తాలూకా, షిరాలి గ్రామ సమీపంలోని తట్టే హక్కాలు నదిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తట్టే హక్కాలు అనే మంచినీటి నదిలోకి 14 మంది సభ్యుల బృందం ఆదివారం ముత్యాల చిప్పల కోసం వెళ్లింది. ఈ సీజన్‌లో ఇక్కడ ముత్యపు చిప్పలు ఎక్కువగా దొరుకుతాయి. వీటిని సేకరించేందుకు స్థానికులు చాలా మంది నదిలోకి వెళ్తుంటారు. బాధితులు నదిలోకి వెళ్లి ముత్యాల కోసం వెతికే సమయానికి నీటి ప్రవాహం తక్కువగా ఉంది. అయితే, ఉన్నట్లుండి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. వేగంగా అలలు వీచాయి. పెరిగిన నీటి ప్రవాహం, అలల ధాటికి ఒక్కొక్కరు కొట్టుకుపోయారు. ఇది గమనించిన మిగతావారు సాయం చేయడానికి ప్రయత్నించారు. నదిలోపలికి వెళ్లి వారిని బయటకు తెచ్చేందుకు ప్రయత్నించగా, వారిలో ఇంకొందరు కూడా కొట్టుకుపోయారు. నీటి లోతును, వేగాన్ని సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల కొందరు, ఇతరుల్ని రక్షించేందుకు ప్రయత్నించి మరికొందరు నీటిలో గల్లంతయ్యారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, రక్షక బృందాలు సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఎనిమిది మృతదేహాల్ని గుర్తించారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. మృతుల్లో ఏడుగురు మహిళలున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నదీ పరివాహక ప్రాంతంలో వర్షం పడటం వల్ల నీటి ప్రవాహం పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. బాధితుల్లో ఎంతమందికి ఈత వచ్చు అనే విషయంపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు.

# లక్ష రూపాయల నగదు సంచిని ఎత్తుకెళ్లిన శునకం..!



**బిజ్నోర్ మే 24మే (మహాప్రభ):** ఉత్తరప్రదేశ్ లోని బిజ్నోర్ జిల్లా లో విచిత్రమైన ఘటన ఒకటి వెలుగుచూసింది. ఓ వ్యాపారవేత్తకు చెందిన లక్ష రూపాయల నగదు ఉన్న సంచిని శునకం నోట కరచుకుని పారిపోయింది. సాధారణంగా దొంగలు డబ్బులు కొట్టేయడం చూస్తుంటాం. కానీ ఇలా ఓ కుక్క ఏకంగా లక్ష రూపాయల నగదును ఎత్తుకెళ్లడంతో స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. ప్రస్తుతం ఆ కుక్క కోసం, అది ఎత్తుకెళ్లిన డబ్బుల సంచి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిజ్నోర్ జిల్లాకు చెందిన ఓ వ్యాపారవేత్త బ్యాంకు నుంచి లక్ష రూపాయల నగదును విత్‌డ్రా చేసుకున్నాడు. ఆ డబ్బును భద్రంగా ఒక సంచిలో పెట్టుకుని తన బైక్‌పై బయల్దేరాడు. నమాజ్‌కు సమయం కావడంతో మార్గమధ్యంలో ఓ మసీదు వద్ద బైక్‌ను ఆపాడు. డబ్బుల సంచిని బైక్‌కే తగిలించి, మసీదు లోపలికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే తిరుగుతున్న ఓ వీధి శునకం కన్ను ఆ సంచిపై పడింది. అందులో ఏదైనా తినే పదార్థం ఉందేమోనని భ్రమపడి క్షణాల వ్యవధిలో దానిని నోట కరచుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. నమాజ్ ముగించుకుని బయటకు వచ్చిన వ్యాపారవేత్తకు బైక్‌పై సంచి కనిపించకపోవడంతో ఒక్కసారిగా గుండె ఆగినంత పనైంది. ఎవరో దొంగలు తన డబ్బును కాజేశారని కంగారుపడుతూ వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మసీదు పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఆ విజువల్స్ చూసిన పోలీసులతోపాటు వ్యాపారవేత్త కూడా నోరెళ్లబెట్టారు. అక్కడ దొంగతనం చేసింది మనుషులు కాదని, ఓ వీధి కుక్క అని సీసీటీవీ ఫుటేజీ ద్వారా స్పష్టమైంది. ప్రస్తుతం ఈ సీసీటీవీ విజువల్స్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకేషనల్ ట్రైనర్‌కు ఘన సన్మానం

**-భాను ఆప్టికల్ అధినేత పి. రమణారెడ్డి**



**దేవరకొండ ( డివిజన్) 24మే (మహాప్రభ):** స్థానిక భాను ఆప్టికల్ అధినేత పి. రమణారెడ్డి ఆధ్వర్యంలో ఒకేషనల్ ట్రైనర్ (వృత్తి విద్యా శిక్షకులు) అశోక్ కుమార్ ను ఘనంగా సన్మానించారు. సమాజంలో వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందిస్తూ, యువతకు ఉపాధి మార్గాలు చూపుతున్న ట్రైనర్ల సేవలు ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా రమణారెడ్డి కొనియాడారు.ఆయన మాట్లాడుతూ... యువత కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, స్వయం ఉపాధిని ఇచ్చే వృత్తి విద్యా కోర్సులపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధిలో ఒకేషనల్ ట్రైనర్ల పాత్ర కీలకమైనదని, వారిని గౌరవించుకోవడం మన బాధ్యతని ఆయన పేర్కొన్నారు. అనంతరం ట్రైనర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు."యువతకు నైపుణ్యాలను అందించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న వృత్తి విద్యా శిక్షకులను ప్రోత్సహించడం మనందరి కర్తవ్యం." పి. రమణారెడ్డి, అధినేత – భాను ఆప్టికల్స్.ఈ సన్మాన కార్యక్రమంలో భాను ఆప్టికల్స్ సిబ్బంది, విద్యార్థులతో పాటు ప్రముఖులు మునిని అంజన్, కొండల్ తదితరులు పాల్గొని ట్రైనర్‌కు తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## శ్రీ ప్రసన్నాంజనేయ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు



**కరీంనగర్, 24మే (మహాప్రభ):** హనుమాన్ నగర్ రోడ్ నం. 2లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న కాలనీ వాసులు ఏకగ్రీవంగా సమావేశమై శ్రీ ప్రసన్నాంజనేయ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. సొసైటీకి అధ్యక్షుడిగా టి. భూపతి రెడ్డి, కార్యదర్శిగా బి. సుధాకర్, కోశాధికారిగా కె. గౌరేశం, ఉపాధ్యక్షుడిగా కె. ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా పి. రవీందర్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా జీ. శ్రీనివాస్, డి. నవీన్ కుమార్, ఎస్.ఆర్. రవీంద్రాచారి, కె. శ్యామ్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. గౌరవ అధ్యక్షులుగా ఉప్పోజు వెంకటరాజం, అన్నాడి తిరుపతి రెడ్డి ఎంపికయ్యారు. అనంతరం అధ్యక్షుడు భూపతి రెడ్డి మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం అందరం కలసికట్టుగా కృషి చేస్తాం. భేదాభిప్రాయాలు లేకుండా ఒకే కుటుంబంలా కలసి మెలసి ఉంటాం అని తెలిపారు.కాలనీ వాసుల ఐక్యతతో ఏర్పడిన ఈ సొసైటీ, స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు పునాది వేస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తాగునీటి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలి

**- దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.**





**ఎల్ బి నగర్ 24 మే (మహాప్రభ)**
జంట నగరాల్లో, ముఖ్యంగా ఎల్ బి నగర్ నియోజకవర్గంలో తీవ్రంగా నెలకొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో గడ్డి అన్నారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని సైతం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రోజురోజుకు పెరుగుతున్న నీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్ బి నగర్ నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించాలని డిమాండ్ చేశారు.

## మే 25 నుంచి 30 వరకు "మహిళా ఆర్థిక వారోత్సవం నిర్వహణ

**-అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలి**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -24మే (మహాప్రభ )**
మే 25 నుంచి 30 వరకు "మహిళా ఆర్థిక వారోత్సవం" నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుండి 30 వరకు జిల్లాలో "మహిళా ఆర్థిక వారోత్సవం" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి దోహదపడే విధంగా అవగాహన కార్యక్రమాలు, రుణ మేళాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 25న అన్ని ఎ యల్ ఎఫ్ యస్, టి యల్ ఎఫ్ యస్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మహిళా ఆర్థిక వారోత్సవంపై అవగాహన కల్పించనున్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని యస్ ఎచ్ జి యస్, ఎ యల్ ఎఫ్ యస్ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాలపై చర్చించనున్నారు.
మే 26 నుండి 30 వరకు మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తుల ప్రదర్శనలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలు, రుణ మేళాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన, మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా వ్యాపారవేత్తలకు అవసరమైన రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంపై ప్రత్యేక సహాయం అందించనున్నారు. మే 27న మహిళా వ్యాపారవేత్తలకు మున్సిపాలిటీలలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేవలు అందించనున్నారు. మే 28న ఐ యం యస్ కార్యక్రమాలపై అవగాహన, యస్ ఎచ్ జి మహిళల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మే 29న రుణ మేళాలు, మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం, యస్ ఎచ్ జి యస్ కు రుణాల మంజూరు కార్యక్రమాలు చేపట్టనున్నారు. మే 30న పి యం ఎఫ్ యం ఇ పథకం కింద క్రెడిట్ లింక్ సబ్సిడీ రుణాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన మహిళా సంఘాలకు ప్రయోజనాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే ఈ వారోత్సవ కార్యక్రమాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిరా, పంచాయతీరాజ్ ఈ నరసింహులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## చల్మెడ లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**నిజాంపేట్ 24 మే (మహాప్రభ)**
నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన కమ్మరి చాకలి బాల్ 60వేలు,చీకటి కనకవ్వ, కు 22వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులకు సహకరించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు, గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం, ఉప సర్పంచ్ ఆకుల మహేందర్, వార్డు సభ్యులు భాజ చంద్రం,మధు, తిరుపతి, గ్రామస్తులు తిరుమలయ్య, బైరయ్య, సురేష్, చంద్రం,తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**-లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్**



**నిజాంపేట్ 24 మే (మహాప్రభ)**
నిజాంపేట మండల కేంద్రంలో ఆదివారం గంగారపు అశోక్ (21) గత 15 రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది.ఇట్టి విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు మీనాక్షి లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్టణ అధ్యక్షులు కొమ్మట బాబు, మాజీ సర్పంచ్ కొమ్మట సత్యనారాయణ, పంజా మహేందర్, జెడ్ చెరువు సర్పంచ్ బాబు నాయక్,వై వెంకటేశం, భూమా గౌడ్,రాజునాయక్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


## జిల్లాలో 65 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి..

**-పది రోజుల్లో కొనుగోలుప్రక్రియను పూర్తి చేస్తాం.**
**-ప్రతి గింజను ప్రభుత్వం కొంటుంది..**
**-10 కేంద్రాల్లో కొనుగోలు పూర్తి..**
**-50134. రైతుల నుండి.ఇప్పటి వరకు 2,41,574.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు..**
**-ధాన్యం నిలువ చేసేందుకు 10 ఇంటర్మీడియట్ గోడౌన్లు ఏర్పాటు.**
**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**




**మెదక్ జిల్లా -24మే (మహాప్రభ )**
ఇప్పటివరకు జిల్లాలో సుమారు 65 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయిందనీ, మిగిలిన కొనుగోళ్లను కూడా వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 65 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 50134. రైతుల నుండి.ఇప్పటి వరకు 2,41,574.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు.. చేసినట్టు వెల్లడించారు. 34,460 రైతులకు. రూ.379.47 కోట్లు జమ.. చేసినట్లు తెలిపారు. మిగతా అమౌంటు ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత నాలుగు రోజుల్లోనే 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు. జిల్లాలో 10 ఇంటర్మీడియట్ గోడౌన్లు ఏర్పాటు చేసి ధాన్యం నిలువ చేసే విధంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు . తద్వారా. కొనుగోలు వేగం పుంజుకుందని తెలిపారు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్--అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. మరో 10 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోజువారీ లక్ష్యాల వారీగా మిగిలిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు.. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిగిలిన ప్రక్రియను మరో 10 రోజుల్లో విజయ వంతంగా పూర్తి చేయడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని జిల్లా యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## జస్టిస్ చంద్రయ్య దశధిన పాల్గొన్న ఎంపీ ఈటెల



**మేడ్చల్ 24 మే (మహాప్రభ)**
డాక్టర్ జస్టిస్ జీ. చంద్రయ్య గారి చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ . జూబ్లీ హిల్స్ కన్వెన్షన్ సెంటర్ లో జరుగుతున్న చంద్రయ్య గారి దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాప సభలో పాల్గొన్నారు.

## ఫ్యాషన్ ఫైల్స్ సఖి బజార్ ఘనంగా నిర్వహణ



**నాగోల్, 24 మే (మహాప్రభ)**
ఫ్యాషన్ ఫైల్స్ సఖి బజార్ నిర్వాకులు, శ్రీగిరి తరుణి, వెంకట మాధవరెడ్డి, ఆధ్వర్యంలో నాగోల్ పీఎంఆర్ లో శని, ఆదివారాలు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్లో 88 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ రెండు రోజులలో మండుటెండల్లో కూడా 8000కు పైగా కస్టమర్లు హాజరై స్టాళ్లను తిలకించి కొనుగోలు చేశారు. మహిళలకు ఒకే చోట అన్ని రకాల ఫ్యాషన్ దుస్తులు చీరలు, నగలు సఖి బజార్లో లభిస్తాయని వారు అన్నారు.

## సంగి గ్రామంలో ఉచిత యోగా శిక్షణ శిబిరం



**గుర్రంపోడు,-24మే (మహాప్రభ )**
మొసంగి గ్రామంలో గ్రామ సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్ యాదవ్ సౌజన్యంతో ఉచిత యోగా శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువత, విద్యార్థులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు సింగం ప్రవీణ్ యాదవ్ మాట్లాడుతూ యువత సక్రమ మార్గంలో నడవాలని సూచించారు. యోగా, విద్య మరియు క్రమశిక్షణను రోజువారీ జీవితంలో అలవర్చుకుంటే ఆరోగ్యంతో పాటు చదువులోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆరోగ్య, చైతన్య కార్యక్రమాలను చేపడుతున్న గ్రామ సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని యోగా సాధన ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ ఆరోపణలు

**- భూషణవేణి సురేష్ గౌడ్**



**పెద్దపల్లి, -24మే (మహాప్రభ )**
పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భూషణవేణి సురేష్ గౌడ్ మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి మారుపేరు విజయరమణ రావు కాగా, అక్రమాలకు కేరాఫ్ దాసరి మనోహర్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం అవినీతి, అక్రమాల అడ్డాగా మారిందని, మట్టి--ఇసుక దందాలు విపరీతంగా పెరిగాయని, రైతుల నుంచి వడ్ల కొనుగోళ్ల సమయంలో తరుగు పేరుతో భారీ దోపిడీ జరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలు నాణ్యత లేకుండా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత కేవలం రెండు నెలల్లోనే దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీల మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించామని తెలిపారు. ప్రస్తుతం పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ, వడ్ల కొనుగోళ్ల ప్రారంభమైన నాటి నుంచి ప్రతి కొనుగోలు కేంద్రాన్ని స్వయంగా సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఎక్కడా కటింగ్స్ లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, మరో వారం రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం తప్ప అభివృద్ధిపై మాట్లాడే స్థితిలో లేరని విమర్శించిన సురేష్ గౌడ్, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ సిద్ధమని సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే విజయరమణారావుపై, కాంగ్రెస్ నాయకులపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెద్దపల్లి పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు కూడా వాస్తవాలను గుర్తిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

# అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి - పిడిశెట్టి రాజు



**హుస్నాబాద్, -24మే (మహాప్రభ )**
కోహెడ మండలం నారాయణపూర్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా లెంకల సంపత్ యాదవ్‌కు చెందిన రెండున్నర ఎకరాల పామాయిల్ తోట పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో తీవ్రంగా నష్టపోయిన రైతును ఆదివారం రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కాలిపోయిన పామాయిల్ చెట్లు, డ్రిప్ వ్యవస్థ, విద్యుత్ లైన్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్ని ప్రమాదాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపూర్ గ్రామ సర్పంచ్ హరి పుష్పలత, ఉప సర్పంచ్ మెట్టు రాజు, బుర్ర శివ, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతుల నష్టాన్ని భర్తీ చేయడం ప్రభుత్వ బాధ్యత అని పిడిశెట్టి రాజు స్పష్టం చేశారు.

# విజయవంతంగా ముగిసిన బ్లూ బెల్స్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం

**కరీంనగర్, -24మే (మహాప్రభ )**
: హనుమాన్ నగర్‌లోని బ్లూ బెల్స్ పాఠశాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. గత నెల 27వ తేదీన ప్రారంభమైన ఈ శిబిరంలో కరాటే, అబాకస్, హ్యాండ్‌రైటింగ్, డాన్స్, ట్రెడిషనల్ గేమ్స్, రోబోటిక్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్ వంటి పలు విద్యా మరియు వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రాలలో ఫండమెంటల్స్‌పై ప్రత్యేక శిక్షణ అందించారు. ఆటపాటలతో కూడిన బోధన విధానం ద్వారా విద్యార్థులు సులభంగా విషయాలను అర్థం చేసుకొని తమ ప్రాథమిక పరిజ్ఞానాన్ని




పెంపొందించుకున్నారు. ముగింపు కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపల్ జంగ సునీత మనోహర్ రెడ్డి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. రోబోటిక్స్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకోగా, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా జంగ సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, వేసవి శిబిరాల ద్వారా పిల్లలు మొబైల్, టీవీలకు పరిమితం కాకుండా తమ సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకొని మేధాశక్తిని పెంపొందించుకుంటారని, విద్యతో పాటు వినోదాత్మక కార్యక్రమాలు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమిరెడ్డి సురేందర్ రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేసవి శిబిరం విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ, భవిష్యత్తు విజయాలకు పునాది వేసిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్‌సర్క్యూట్‌తో ఘోర అగ్నిప్రమాదం



**హుస్నాబాద్, -24మే (మహాప్రభ )**
అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామంలో రైతుల పొలాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆళ్ల కొమురయ్య, మల్లం రాజు, జంగపల్లి రాజయ్య, తిగుల్ల చంద్రం, మల్లం నరసింహులు రైతులకు చెందిన పశుగ్రాసం, మోటార్ పంప్‌సెట్ కేబుల్స్, పైపులు, అలాగే పెద్ద మర్రిచెట్టు దగ్ధమయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల వరకు నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువత, గ్రామస్తుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, తనిఖీలు క్రమం తప్పకుండా చేపట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఘటనపై స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, అవసరమైన సహాయం అందించడంతో పాటు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతుల నష్టాన్ని భర్తీ చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్థానికులు స్పష్టం చేశారు.

# ఘనంగా ఇందిరా చౌక్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ జన్మదిన వేడుకలు

**కరీంనగర్, -24మే (మహాప్రభ )**
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఫహద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ అంజన్ కుమార్, నరేందర్ రెడ్డి, రాజశేఖర్ మహేష్ గౌడ్ రైతు బిడ్డగా ప్రారంభించి టీపీసీసీ అధ్యక్షుడి స్థాయికి ఎదిగిన ప్రస్థానం ఆదర్శమని, ఆయనపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు భయంతో కూడుకున్నవని పేర్కొన్నారు. మహేష్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతోందని, రాబోయే




ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. మహేష్ గౌడ్ ప్రజా నాయకుడిగా, అందరినీ కలుపుకొని నడిపించే వ్యక్తిగా, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని వారు కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మహేష్ గౌడ్ సారథ్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామ్ రెడ్డి రామ్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అహమ్మద్ అలీ, వరాల నర్సింగం, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, మూల రవీందర్ రెడ్డి, మూల జైపాల్, వీర దేవేందర్, వసీం, సరిల్లా రతన్ రాజు, గంగుల దిలీప్, కంకణాల అనిల్, అమీర్, కుంభాల రాజకుమార్, ఇమ్రాన్, సాయిని తిరుపతి, మాజీద్ అలీ ఖాన్, మంద మహేష్, మాదాసు శ్రీనివాస్, గడప శ్రీనివాస్, మాలోతు మహాలక్ష్మి, శిల్పా, స్వప్న శ్రీ, ఇమ్రాన్ గని, పెంట శేఖర్, హాజీ, పాషా, అందే శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఇందిరా చౌక్‌లో కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా పాల్గొనడంతో వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి.

# పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రవర్తనపై తీవ్ర విమర్శలు



**హుస్నాబాద్, -24మే (మహాప్రభ )**
రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడలు, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్‌పై ప్రెస్ మీట్‌లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమర్యాదకరంగా ప్రవర్తించారని తెలంగాణ ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ స్థాయి నుండి ఎదిగి ప్రజా సమస్యలు, కార్యకర్తల కష్టసుఖాలు తెలిసిన నాయకుడైన శ్రీహరి ముదిరాజ్‌పై తోటి మంత్రివర్యులుగా మర్యాద లేకుండా పేపర్లు విసరడం యావత్ ముదిరాజ్ జాతికి అవమానమని ఆయన పేర్కొన్నారు. వెంటనే తన ప్రవర్తనను సవరించి అదే మీడియా సమక్షంలో క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనను పార్టీ క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ మల్లు రవి దృష్టికి తీసుకెళ్లి చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ముదిరాజ్ సంఘం ఈ ఘటనను తీవ్రంగా తప్పుపడుతూ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రవర్తన మారాలని స్పష్టం చేసింది.


## అంబేద్కర్ సంఘం అధ్యక్షునిగా కల్లేపెల్లి కృష్ణ నియామకం



**గంగాధర, -24మే (మహాప్రభ )** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని వెంకటాయపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సంఘం అధ్యక్షుని ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో కల్లేపెల్లి కృష్ణ అధ్యక్షుడిగా, కొత్తూరు అనిల్ ఉపాధ్యక్షుడిగా, కల్లేపెల్లి గంగ స్వామి ప్రధాన కార్యదర్శిగా, గుండు మహేష్ సంయుక్త కార్యదర్శిగా, ఉండేటి రమేష్, గాలి పెల్లి మహేష్ కోశాధికారులుగా ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులుగా కల్లేపెల్లి ప్రదీప్, గుండు మహేష్, కల్లేపెల్లి అక్షయ్ బాధ్యతలు చేపట్టగా, సలహాదారులుగా కల్లేపెల్లి మల్లేశం, కల్లేపెల్లి మల్లయ్యను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కల్లేపెల్లి మహేష్, కల్లేపెల్లి గంగసాగర్ ఎంపికయ్యారు. పైవారిని పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేసిన ముదిరాజ్ రాష్ట్ర నాయకులు నిమ్మల నగేష్ ముదిరాజ్

**చౌటుప్పల్-24మే (మహాప్రభ )**
మండలం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహకారంతో నారాయణపురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి -- లింగస్వామి గారి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన చేనేత కార్మికులు సింగం ఊర్మిళ -- కృష్ణ దంపతుల ఇల్లు నిర్మాణంలో భాగంగా 20వేల రూపాయలను ఆర్థిక సహాయంగా నారాయణపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు 4 నాలుగవ వార్డు మెంబర్ సూరపెల్లి



వెంకటేష్ పద్మశాలి గారి సహకారంతో అందించారు ముదిరాజ్ రాష్ట్ర నాయకులు నిమ్మల నగేష్ ముదిరాజ్ గారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించినందుకు గాను నిమ్మల నగేష్ సూపెల్లి వెంకటేశం గార్లకు కృతజ్ఞతలను తెలియజేశారు

# బిజినెస్

# పసిడి ప్రియులకు స్వల్ప ఊరట..

## స్థిరంగా బంగారం, వెండి ధరలు.. తులం ఎంతంటే?

ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలను లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ నిర్ణయిస్తుంది. అక్కడ జరిగే ట్రేడింగ్ ఆధారంగా ప్రపంచ దేశాల్లో ధరలు మారుతుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం వ్యాపారం అమెరికన్ డాలర్లలో జరుగుతుంది. డాలర్ విలువ బలపడితే బంగారం ధరలు తగ్గుతాయి, డాలర్ విలువ తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కాబట్టి ప్రతిరోజూ బంగారం, వెండి ధరల్లో మార్పులు జరుగుతూ ఉంటాయి. గత కొన్ని రోజులు వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు మూడ్రోజులుగా తగ్గుముఖం పట్టాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మే 24 ఆదివారం ఉదయం 6 గంటలకు దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,59,060గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,45,800 వద్ద కొనసాగుతుంది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర రూ. 1,19,290 వద్ద ట్రేడవుతుంది. ఇక దేశీయ మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.2,85,000 వద్ద కొనసాగుతుంది.



దాదాపు శనివారం కూడా ఇవే రేట్లు ఉన్నాయి. అంటే నిన్నతో పోల్చుకుంటే ఇవాళ రేట్లలో ఎలాంటి పెరుగుదల లేదు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల సహా దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు స్థిరంగానే ఉన్నాయి.

**దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఇలా**

హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,45,800 వద్ద ట్రేడవుతోంది.

ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,210 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,45,950 వద్ద ట్రేడవుతోంది.

ఇక ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరరూ.1,59,060 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,45,800వద్ద ట్రేడవుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,45,800 వద్ద ట్రేడవుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,690 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,47,300 వద్ద ట్రేడవుతోంది.

కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,45,800 వద్ద ట్రేడవుతోంది.

కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,45,800 వద్ద ట్రేడవుతోంది.

# డిపాజిట్లపై బీవోఐ వడ్డీ పెంపు




**ముంబై, మే 24**

బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) డిపాజిట్లపై వడ్డీరేట్లను సవరించింది. రూ.3 కో ట్ల లోపు ఏడాది నుంచి మూడేండ్ల లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేటును పెంచిం ది. దీంతో ఏడాది నుంచి రెండేండ్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటు 6.50 శాతానికి పెంచిన బ్యాంక్.. రెండేండ్ల నుంచి మూడేండ్ల లోపు డిపాజిట్లపై వడ్డీని 6.60 శాతంగాను, అలాగే మూడేండ్లలోపు డిపాజిట్లపై వడ్డీని 6.70 శాతానికి సవరించింది. సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.50 -0.65 శాతం వడ్డీని చెల్లించనున్నది.

# లాభాల్లో దివీస్

**హైదరాబాద్,**

ఫార్మా సంస్థ దివీస్ ల్యాబ్ అంచనాలకుమించి రాణించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.751 కోట్ల నికర లాభాన్ని గడించింది. కిందటేడాది నమోదైన లాభంతో పోలిస్తే 13 శాతం వృద్ధి కనబరిచింది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 9.5 శాతం ఎగబాకి రూ.2,831 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.30 తుది డివిడెండ్‌ను ప్రకటించింది




# ముంబైపై ఘన విజయంతో ప్లే ఆఫ్స్‌కు రాజస్థాన్..

## ఢిల్లీ, పంజాబ్, కోల్‌కతా ఇంటికి ..!

పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్ పట్టేసింది. ఉత్కంఠ పోరులో అదిరే ఆటతో ముంబై ఇండియన్స్ కు చెక్ పెట్టిన రాజస్థాన్.. ఎలిమినేటర్ ఆడాలనుకున్న పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఇంటికి పంపింది. వాంఖడేలో జోఫ్రా ఆర్చర్(32, 3-17) ఆల్‌రౌండ్ షోతో ముంబై బెంబేలెత్తిపోయింది. భారీ ఛేదనలో సూర్యకుమార్ యాదవ్(60) ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌ను రాజస్థాన్ ఢీకొట్టనుంది.చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ సమిష్టి కృషితో ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. గెలిస్తేనే ఎలిమినేటర్ బెర్తు దక్కనున్న వేళ జోఫ్రా ఆర్చర్(32, 3-17) చెలరేగాడు.వాంఖడేలో ముంబై ఇండియన్స్ బౌలర్లను బాదేసిన అర్చర్.. అనంతరం బంతితోనూ ఆ జట్టు బ్యాటర్లను వణికించాడు. బ్రిజేష్ శర్మ(2-26), బర్గర్(2-43) కీలక వికెట్లు తీసి సహకరించగా 8వ విజయం.. 16 పాయింట్లతో రాజస్థాన్ ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది.రాజస్థాన్‌కు భారీ స్కోర్ సమర్పించుకున్న ముంబై బ్యాటింగ్‌లో తడబడుతోంది. తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ(0)ను డకౌట్




చేసిన ఆర్చర్(3-17) తర్వాతి ఓవర్లో నమన్ ధిర్(6)ను బౌల్డ్ చేసి రెండో వికెట్ అందించాడు. బర్గర్ ఓవర్లో రికెల్టన్(12)కవర్స్‌లో వైభవ్ చేతికి చిక్కగా. 24 వద్ద మూడో వికెట్ పడింది. అనంతరం సూర్యకుమార్ యాదవ్(60)తో కలిసి తిలక్ వర్మ(3) ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నాడు. కానీ, బ్రిజేష్ అతడిని బౌల్డ్ చేయడంతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది ముంబై. విల్ జాక్స్(33) జతగా సూర్య ధనాధన్ ఆడగా ముంబై స్కోర్ వంద దాటింది. అయితే.. ఐదో వికెట్‌కు 63 రన్స్ జోడించిన జాక్స్‌ను యశ్ రాజ్ ఔట్ చేయగా వస్తూనే హార్దిక్ పాండ్యా(34) రెండు సిక్సర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. గెలిపించే బాధ్య తీసుకున్న ఈ ఇద్దరూ రాజస్థాన్‌ను భయపెట్టారు. రెండో స్పెల్‌లో ఆర్చర్ మరో వికెట్ అందిస్తూ పాండ్యాను వెనక్కి పంపాడు. కార్బిన్ బాస్చ్(2) విఫలమవ్వగా.. శార్దూల్ ఠాకూర్(10 నాటౌట్) అండతో ముంబైని గట్టెక్కించాలనుకున్న సూర్యను బర్గర్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ పంపడంతో రాజస్థాన్ విజయం ఖాయమైంది. చివరి ఓవర్లో 37 రన్స్ అవసరమవ్వగా శనక ఆరు పరుగులే ఇచ్చాడు. దాంతో.. 30 పరుగులతో గెలుపొందిన రాజస్థాన్ నాలుగో స్థానంతో మురిసింది.

**రాణించిన జురెల్, ఆర్చర్**

ప్లే ఆఫ్స్ బెర్తును నిర్ణయించే మ్యాచ్‌లో రాజస్థాన్ బ్యాటర్లు టాపార్డర్ బ్యాటర్లు తేలిపోయారు. పవర్ ప్లేలోనే ముంబై ఇండియన్స్ బౌలర్లు మూడువికెట్లతో దెబ్బతీయగా.. మిడిలార్డర్ సైతం తడబడింది. దంచికొట్టే ఓపెనర్లు స్వల్ప స్కోర్‌కే ఔటైన వేళ ధ్రువ్ జురెల్(38), ఆర్చర్(32)లు ఆపద్భాదంవులయ్యారు. కానీ, డెత్ ఓవర్లలో శార్దూల్(2-41) విజృంభించినా జడేజా(19 నాటౌట్) మెరుపులతో రాజస్థాన్ రెండొందలు కొట్టింది.

# భారత్ మ్యాచ్‌కు ప్రాధాన్యం ఇవ్వం.. ఎందుకంటే..!

ఐసీసీ టోర్నమెంట్ ఏదైనా భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజే వేరు. పురుషుల జట్టైనా, మహిళల టీమైనా నువ్వానేనా అంటూ తలపడడం అభిమానులకు భలే కిక్కిస్తుంది. ఈసారి మహిళల టీ20 ప్రపంచకప్‌లో మరోసారి దాయాదులు తాడోపేడో తేల్చుకోనున్నాయి. లీగ్ దశలో చిరకాల మ్యాచ్ గురించి పాక్ కెప్టెన్ ఫాతిమా సనా(ఖీఫ్‌అఝ ఝఅఝ) ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అందరూ ఊహిస్తున్నట్టు ఇండియాతో మ్యాచ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వబోవని ఫాతిమా పేర్కొంది.టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా పాకిస్థాన్ జట్టు లాహోర్‌లో శిక్షణ శిబిరంలో బిజీగా ఉంది. జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌తో జరుగనున్న మ్యాచ్‌కు ఎలా సన్నద్ధమవుతున్నారు? అని కెప్టెన్ సనా ఫాతిమాను మీడియా ప్రశ్నించగా ఆమె 'అదేం లేదు.. ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలనుకోవడం లేదు' అని చెప్పింది. మేము ప్రపంచకప్ కోసం బాగా సన్నద్ధమయ్యాం. వరల్డ్‌కప్‌లో ప్రతి మ్యాచ్ ముఖ్యమే. టీ20 ఫార్మాట్లో ఎప్పుడు ఏదైనా జరగొచ్చు. అందుకని మేము ఒక మ్యాచ్ కోసం ప్రత్యేకంగా సిద్ధమవ్వడం లేదు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. దేవుడి ఆశీర్వాదంతో మేము మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటున్నాం అని ఫాతిమా వెల్లడించింది.భారత్





13సార్లు ఇటీవలే స్వదేశంలో జింబాబ్వేను వైట్‌వాష్ చేసిన పాకిస్థాన్ ప్రపంచకప్ పోటీలకు ఆత్మవిశ్వాసంతో రానుంది. కెప్టెన్ ఫాతిమా 15 బంతుల్లోనే వేగవంతమైన అర్ధ శతకతో రికార్డు నెలకొల్పింది కూడా. వరల్డ్‌కప్ ముందు ఐర్లాండ్, వెస్టిండీస్‌తో పాక్ ముక్కోణపు సిరీస్ ఆడనుంది. జూన్ 12 నుంచి మొదలయ్యే పొట్టి కప్‌లో భారత్, పాక్ గ్రూప్ ఏలో ఉన్నాయి. లీగ్ దశలో ఇరజట్లు జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తలపడనున్నాయి. రికార్డు గమనిస్తే.. టీ20 వరల్డ్‌కప్‌లో పాక్‌పై టీమిండియాదే పైచేయి. ఇప్పటివరకూ 16 మ్యాచుల్లో భారత్ 13సార్లు దాయాదిని చిత్తు చేసింది.

# స్పోర్ట్స్

# భారత అథ్లెటిక్స్ చరిత్రలో సరికొత్త సంచలనం..

## -జాతీయ రికార్డు బద్దలు..!



భారత అథ్లెటిక్స్ లో సరికొత్త సంచలనం నమోదైంది. పరుగు పందెంలో మనకు ఒక ఉసేన్ బోల్ట్ దొరికేశాడంటూ క్రీడాభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాంచీ వేదికగా జరుగుతున్న 2026 అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్‌లో పంజాబ్ కు చెందిన 25 ఏళ్ల గురిందర్‌వీర్ చిరుతలా పరుగెత్తాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో కేవలం 10.09 సెకన్లలోనే గమ్యాన్ని చేరి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు. సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు.తన అద్భుత ప్రదర్శనతో గురిందర్‌వీర్ భారత అథ్లెటిక్స్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాడు. 10.10 సెకన్ల కంటే తక్కువ సమయంలో 100 మీటర్ల దూరాన్ని పూర్తి చేసిన మొట్టమొదటి భారత అథ్లెట్‌గా నిలిచాడు. రిలయన్స్ ఫౌండేషన్ తరపున బరిలోకి దిగిన గురిందర్‌వీర్, పాత జాతీయ రికార్డును బద్దలు కొట్టి ఈ చారిత్రక విజయాన్ని అందుకున్నాడు. అద్భుతమైన టైమింగ్‌తో గురిందర్‌వీర్ 2026 కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత కూడా సాధించాడు. కామన్వెల్త్ క్రీడల అర్హత మార్క్ 10.16 సెకన్లు కాగా.. దాన్ని వీర్ సునాయాసంగా అధిగమించాడు. ఇదే ఈవెంట్‌లో అనిమేష్ కుజుర్ (10.20 సెకన్లు) రజతం గెలుచుకోగా, ప్రణవ్ గురవ్ (10.29 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కాగా గురిందర్‌వీర్ విజయం భారత స్ప్రింటింగ్‌లో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోనుంది.

# విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన'లో 'కన్నప్ప' బ్యూటీ స్పెషల్ సాంగ్!




టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, టాలెంటెడ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రౌడీ జనార్ధన'. ప్రముఖ నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో మాస్ ఆడియన్స్‌ను ఊపేసే ఒక అదిరిపోయే స్పెషల్ సాంగ్ ఉండబోతోందట. దర్శకుడు రవి కిరణ్ ఈ పాట కోసం ఒక పవర్‌ఫుల్ సిచువేషన్‌ను సిద్ధం చేయగా, అందులో విజయ్ పక్కన స్టెప్పులేసేందుకు 'కన్నప్ప' ఫేమ్ బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెతో చర్చలు నడుస్తున్నాయని, అంతా అనుకూలిస్తే రౌడీ హీరోతో కలిసి ప్రీతి ముకుందన్ మాస్ డ్యాన్స్‌తో థియేటర్లలో రచ్చ చేయడం ఖాయమని అంటున్నారుఈ సినిమాపై అంచనాలు పెంచే మరో క్రేజీ అప్‌డేట్ ఏంటంటే.. టాలీవుడ్ యాంగ్రీ మ్యాన్, సీనియర్ హీరో రాజశేఖర్ ఈ చిత్రంలో ఒక అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నారు. ఆయన క్యారెక్టర్‌ను మునుపెన్నడూ చూడని విధంగా, ఎంతో వైవిధ్యంగా డిజైన్ చేశారట. ముఖ్యంగా రాజశేఖర్ సరికొత్త లుక్ ఈ సినిమాకే పెద్ద హైలైట్‌గా నిలుస్తుందని ఇండస్ట్రీ టాక్. మహానటి కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఓ వైపు 'రణబాలి' సినిమా చేస్తూనే, మరోవైపు ఈ 'రౌడీ జనార్ధన' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కమర్షియల్ సక్సెస్ అందుకోవాలని విజయ్ దేవరకొండ పూర్తి కసిగా ఉన్నాడు.



# ఆ స్టార్ హీరో ఇచ్చిన సలహా ఇప్పటికీ పాటిస్తున్నా..

టాలీవుడ్ అందాల చందమామ కాజల్ అగర్వాల్.. ప్రస్తుతం సినిమాల స్పీడ్ తగ్గించింది. పెళ్లి తర్వాత ఈ ముద్దుగుమ్మ ఆచితూచి సినిమాలు చేస్తుంది. భగవంత్ కేసరి సినిమా తర్వాత ఇప్పుడు ఈ అమ్మడు తెలుగులో మరో సినిమా చేయలేదు. కాగా గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో తన కో స్టార్స్ గురించి, అల్లు అర్జున్, ప్రభాస్‌లతో తన జ్ఞాపకాలను ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. తాను తన సహనటులందరితోనూ మంచి పని సంబంధాలను కలిగి ఉన్నానని, సెట్‌లో అందరూ సహకారంతో ఉంటారని చెప్పుకొచ్చింది. సలహాలను ఎల్లప్పుడూ స్వాగతిస్తానని, కొన్నిసార్లు సహనటులు ఇచ్చిన సలహాలను తాను ఉపయోగించి అవి విజయవంతం అయినప్పుడు వారికి కృతజ్ఞతలు చెప్పడానికి వెనకాడనని కాజల్ పేర్కొన్నారు.అలాంటి ఒక ముఖ్యమైన సలహాను అల్లు అర్జున్ నుండి పొందినట్లు కాజల్ గుర్తుచేసుకున్నారు. తాను స్వతహాగా ఆత్రుత కలిగిన, చురుకైన వ్యక్తిని కాజల్ తెలిపింది. డైరెక్టర్ "కట్" అని చెప్పిన వెంటనే ఆ సీన్ ఎమోషన్ ను వదిలేసే అలవాటు తనకు ఉండేదని, కట్ చెప్పిన వెంటనే తాను రిలాక్స్ అయ్యేదానినని ఆమె చెప్పారు. అయితే, బన్నీ తనకు "కట్" చెప్పిన తర్వాత కెమెరా బీప్ సౌండ్ వినిపించే వరకు భావోద్వేగాన్ని అలానే ఉంచమని సలహా ఇచ్చారని కాజల్ వెల్లడించారు.ఇది సినిమా ఎడిటర్‌కు సులువుగా ఉంటుందని బన్నీ చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ సలహా తనకు ఎంతో ఉపయోగపడిందని, దీనిని తాను ఇప్పటికీ పాటిస్తున్నానని ఆమె తెలిపారు. సహనటుల ఎత్తు గురించి అడిగినప్పుడు, తనతో నటించినవారు సాధారణంగా తనకంటే పొడవుగానే ఉంటారని, అందుకే తాను ఎక్కువ ఎత్తు ఉన్న హీల్స్ ధరించలేనని కాజల్ చెప్పుకొచ్చింది తాను సాధారణంగా 1-2 అంగుళాల హీల్స్ మాత్రమే ధరిస్తానని చెప్పారు.అయితే, ప్రభాస్‌తో కలిసి పనిచేసినప్పుడు తాను చాలా హ్యాపీగా ఫీల్ అయ్యేదనినని తెలిపింది కాజల్. డార్లింగ్ సినిమాలో ప్రభాస్‌తో కలిసి నటించినప్పుడు 4-6 అంగుళాల హీల్స్ ధరించగలిగానని, స్టిలెటోస్ వంటి ఎత్తైన హీల్స్‌తో కనిపించానని ఆమె ఆనందంగా పంచుకున్నారు. ఒక నటి విజయవంతం కావడానికి గ్లామర్, నటన నైపుణ్యాలు రెండూ ముఖ్యమని కాజల్ చెప్పుకొచ్చింది.అయితే తాను నటన నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేసింది. గ్లామర్ అంటే కేవలం అందాల ప్రదర్శన కాదని కాజల్ చెప్పుకొచ్చింది. చీరలో లేదా జీన్స్‌తో బాగా సరిపోయే ఫుల్-స్లీవ్ టీ-షర్ట్‌లో కూడా తాను చాలా గ్లామరస్‌గా కనిపించగలనని తెలిపింది. సొగసైన రూపానికి, అసభ్యంగా ఉండటానికి మధ్య ఒక సన్నని గీత ఉంటుందని కాజల్ తెలిపింది. తాను సొగసైన రూపానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తానని, ఆ గీతను దాటి ఎప్పుడూ అసభ్యంగా ప్రవర్తించబోనని ఆమె తెలిపింది. తన తండ్రితో కలిసి సినిమా చూడలేని విధంగా తాను ఎప్పుడూ అందాల ప్రదర్శన చేయనని ఆమె తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చేసింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



## ప్రేమ, పెళ్లి గురించి అవికా ఇంట్రెస్టింగ్ కామెంట్స్

నటి అవికా గోర్ రీసెంట్ గా అగ్లీ స్టోరీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా పాజిటివ్ టాక్ తో దూసుకుపోతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది అవికా. తన ఏడేళ్ల ప్రేమ వివాహం, పెళ్లి తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి తెలిపింది అవికా. బాలికా వధు వంటి సీరియల్ తో చిన్నతనంలోనే ఆమె కెరీర్ ప్రారంభమైంది. ముంబైలో పెరిగిన అవికాకు రాజస్థానీ భాషపై అవగాహన లేకపోయినా, బాలికా వధులో రాజస్థానీ పాత్రకు ఎంపికైంది. ఈ సీరియల్ విజయం ఆమెకు విశేష గుర్తింపు తెచ్చింది.ఆ తర్వాత 15 ఏళ్ల వయస్సులో ఉయ్యాల జంపాల చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. తాను సినిమాల్లోకి రావాలని, ప్రత్యేకించి తెలుగు చిత్రాలు చేయాలని ఎప్పుడూ అనుకోలేదని, కానీ ఇదంతా అనూహ్యంగా జరిగిందని అవికా తెలిపింది. తన కెరీర్ వేగంగా సాగిందని, బాలికా వధు, ఉయ్యాల జంపాల వంటి డ్రీమ్ రోల్స్ చిన్నతనంలోనే దక్కాయని అవికా చెప్పుకొచ్చింది. తనది ప్రేమ వివాహమని, ఏడేళ్ల నుంచి తమకు ఒకరి గురించి మరొకరికి తెలుసని తెలిపింది. తన తల్లి ఆరు నెలల్లోనే తన భర్తను ఒప్పుకున్నారని అవికా గోర్ పేర్కొంది.పెళ్లి తర్వాత తమ దాంపత్య జీవితం చాలా సంతృప్తికరంగా ఉందని, ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఒకరి ఎదుగుదలకు మరొకరు మద్దతు ఇస్తూ తమ సంబంధాన్ని నిర్వహిస్తున్నామని తెలిపింది. సామాజిక మాధ్యమాల ప్రభావం తమ సంబంధంపై ఉండదని, తాము వాటికి అతీతంగా ఆలోచిస్తామని అవికా తెలిపింది. తామిద్దరూ ఒకరికొకరు చాలా సపోర్ట్ గా ఉంటామని , తమ తల్లిదండ్రుల బంధాన్ని ఆదర్శంగా తీసుకుంటామని అవికా చెప్పుకొచ్చింది. తన భర్త కార్పొరేట్ రంగంలో సీనియర్ ప్రాడక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని, ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి అని అవికా తెలిపింది.ఆయన బెంగళూరులో పనిచేసి ప్రస్తుతం బ్యాంకాక్‌లో స్థిరపడ్డారని. అవికా కూడా బ్యాంకాక్‌లోనే నివసిస్తున్నప్పటికీ, సినిమాల కోసం ఇండియాకు వస్తూ ఉంటాను అని చెప్పుకొచ్చింది. తమ కెరీర్లు వేర్వేరు అయినప్పటికీ, ఒకరికొకరు అర్థం చేసుకుంటూ, ఒకరి ఎదుగుదలకు మరొకరు మద్దతు ఇస్తూ తమ జీవితాన్ని సమతుల్యం చేసుకున్నట్లు తెలిపింది. తన భర్త తన వృత్తిని మాత్రమే కాకుండా, వ్యక్తిగా తనను అర్థం చేసుకుంటారని, తన పని వల్ల కాకుండా తన వ్యక్తిత్వం వల్ల తనను ప్రేమిస్తారని అవికా తెలిపింది.తన కెరీర్ ప్రయాణాన్ని తాను ఎప్పుడూ అంచనా వేయలేకపోయానని అవికా పేర్కొంది. ఏ సినిమా హిట్ అవుతుందో, ఏది ఫ్లాప్ అవుతుందో తనకు తెలియదని తెలిపింది అవికా. అలాగే భవిష్యత్తులో రాజకీయాల్లోకి ప్రవేశించడం వంటి అనూహ్య విషయాలపై కూడా ఆమె సానుకూలంగా స్పందించింది.. స్మృతి ఇరానీ వంటి వారు పార్లమెంట్‌లో నిలబడినట్లుగా, తాను కూడా అలాంటిది ఏదైనా చేయడానికి వెనుకాడనని, ఎందుకంటే తనకు ఏది ఆశ్చర్యం కలిగించదని ఆమె అన్నారు. ఏ రోజు ఏం జరుగుతుందో తన కెరీర్‌లో అంచనా వేయలేనని, కాబట్టి భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించడం మానేశానని అవికా చెప్పుకొచ్చింది.


# బాక్సాఫీస్ వద్ద 'దృశ్యం 3' సునామీ..

### కేవలం 3 రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో మోహన్‌లాల్!




మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సెన్సేషనల్ డైరెక్టర్ జీతు జోసెఫ్ కాంబినేషన్‌లో వచ్చిన మోస్ట్ అవేటెడ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. థియేటర్లలోకి వచ్చిన కేవలం మూడు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం మూడో రోజు ముగిసే సమయానికి ఈ చిత్రం గ్లోబల్ వైడ్‌గా ఏకంగా రూ. 117.17 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించడమే కాకుండా, మలయాళ చిత్ర పరిశ్రమలో అత్యంత వేగంగా వంద కోట్ల క్లబ్‌లో చేరిన రెండవ సినిమాగా సరికొత్త చరిత్ర లిఖించింది.బాక్సాఫీస్ లెక్కల విషయానికి వస్తే ఇండియాలో ఈ సినిమా ఇప్పటివరకు రూ. 40.60 కోట్ల నెట్ వసూలు చేయగా, మొదటి రోజుతో పోలిస్తే శని, ఆదివారాల్లో కలెక్షన్లు భారీగా పుంజుకున్నాయి. విదేశాల్లో కూడా ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుండటంతో ఓవర్సీస్ మార్కెట్‌లోనే ఏకంగా రూ. 70 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఎప్పటిలాగే మలయాళ వెర్షన్ రూ. 11.65 కోట్ల నెట్ కలెక్షన్లతో టాప్‌లో నిలవగా, తెలుగు, తమిళ, కన్నడ వెర్షన్లు కూడా మంచి వసూళ్లను సాధిస్తున్నాయి. మిశ్రమ సమీక్షలు వచ్చినప్పటికీ జార్జ్‌కుట్టి పాత్రపై ఉన్న క్రేజ్ ప్రేక్షకులను థియేటర్లకు పరుగులు పెట్టిస్తుండటంతో కేరళలో దాదాపు 67% పైగా అక్యుపెన్సీతో థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. ఈ ఘన విజయంపై మోహన్‌లాల్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, గడిచిన 13 ఏళ్లుగా జార్జ్‌కుట్టి కుటుంబంపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ, నమ్మకానికి చేతులెత్తి మొక్కుతున్నానని అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబావూర్ నిర్మించిన ఈ సినిమాలో మీనా, అన్సిబా, ఎస్తేర్ అనిల్ కీలక పాత్రలు పోషించారు.

# ఓటీటీలోకి ధనుష్ 'కర'.. స్ట్రీమింగ్ ఎప్పటినుంచంటే?




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన తాజా రూరల్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా 'కర' థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోపే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకుంది. మే 28 (2026) నుండి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా మేకర్స్ ప్రకటించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉండబోతుంది. మమితా బైజు (మలయాళ 'ప్రేమలు' ఫేమ్) ఇందులో కథానాయికగా నటించగా.. కేఎస్ రవికుమార్, జయరామ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటించారు. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించాడు.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1991 గల్ఫ్ వార్ నేపథ్యంలో సాగే ఒక పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్. ఇందులో కరస్వామి అలియాస్ కర (ధనుష్) ఒక ప్రొఫెషనల్ దొంగ. తాను ప్రాణంగా ప్రేమించిన మల్లి (మమితా బైజు) కోసం ఆ నేర జీవితాన్ని వదిలేసి, సొంతంగా ఒక హోటల్ పెట్టుకుని బతకాలని అనుకుంటాడు. పెట్టుబడి కోసం తన ఊరిలో ఉన్న తాతల నాటి పొలం కాగితాలను బ్యాంకులో తాకట్టు పెట్టాలని ప్లాన్ చేస్తాడు. కానీ, కొన్ని అనుకోని పరిస్థితుల్లో ఆ పొలాన్ని బ్యాంకు జప్తు చేస్తుంది. దాంతో తన కుటుంబ ఆస్తిని కాపాడుకోవడానికి కర మళ్లీ దొంగగా మారాల్సి వస్తుంది. ఒకే బ్యాంకుకు చెందిన వివిధ బ్రాంచ్‌లలో బ్యాంక్ రాబరీలకు పాల్పడుతుంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది అనేదే సినిమా కథ.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com